మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

## జిల్లాలో యూరియా కొరత లేదు..

- ఉదయం 6 గంటల నుండి విక్రయాలు ప్రారంభం..
- నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 29 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలో యూరియా కొరత లేదని కలెక్టర్ బాదావత్ సంతోష్ జిల్లా రైతాంగానికి స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి మండల స్థాయి అధికారులతో యూరియా పంపిణీ నిలువలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని జిల్లావ్యాప్తంగా యూరియా సరఫరా పూర్తిస్థాయిలో పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేస్తున్న అన్ని యూరియా పంపిణీ కేంద్రాలకు అవసరమైనంత స్టాక్ అందుబాటులో ఉందని పేర్కొన్నారు. రైతులకు సౌకర్యవంతంగా, క్రమబద్ధంగా యూరియా పంపిణీ నిర్వహించేలా ప్రతి ప్రభుత్వ యూరియా పంపిణీ కేంద్రం ముందు తప్పనిసరిగా శామియానా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే రైతులకు స్పష్టంగా కనిపించే విధంగా పంపిణీ కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఒకే కౌంటర్ వద్ద రద్దీ ఏర్పడకుండా, ప్రతి కేంద్రంలో అవసరానికి అనుగుణంగా బహుళ కౌంటర్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి యూరియా విక్రయ కేంద్రంలో యూరియా బుకింగ్ యాప్‌కు సంబంధించిన క్యూర్ కోడ్‌ను స్పష్టంగా ప్రదర్శించాలన్నారు. తద్వారా రైతులు సులభంగా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని బుకింగ్ చేసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. విక్రయ కేంద్రాలకు యూరియా సరఫరా తగినంతగా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఎక్కడా అంతరాయం లేకుండా స్టాక్‌ను అందుబాటులో ఉంచాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. రైతుల రద్దీని దృష్టిలో ఉంచుకొని జిల్లావ్యాప్తంగా అన్ని యూరియా కేంద్రాల్లో ఉదయం 6 గంటల నుంచే యూరియా విక్రయాలు ప్రారంభించాలన్నారు. జిల్లాలో రైతులు ఆందోళన చెందవద్దని, అవసరమైన యూరియా పూర్తిగా అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ భరోసా ఇచ్చారు. యూరియా పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరగకుండా పర్యవేక్షణ మరింత కట్టుదిట్టంగా చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపుకలెక్టర్. పిఅమరేందర్, జిల్లావ్యవసాయ అధికారి యశ్వంత్‌రావు మండలస్థాయి వ్యవసాయాధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ డి. జానకి

### ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి
## ప్రజావాణి గ్రీవెన్స్ డే

- ఫిర్యాదుదారుల నుంచి
- స్వయంగా దరఖాస్తులు స్వీకరించిన జిల్లా ఎస్పీ
- బాధితులకు న్యాయం జరిగేలా
- పారదర్శక విచారణ చేపట్టాలి : జిల్లా ఎస్పీ డి. జానకి

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 29 ప్రభాతవార్త :** ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే లక్ష్యంగా ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి / గ్రీవెన్స్ డే కార్యక్రమంలో భాగంగా సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 15 మంది ఫిర్యాదుదారుల నుంచి స్వయంగా దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల సమస్యలను శ్రద్ధగా విని, ఆయాసమస్యలకు సంబంధించిన వివరాలను సంబంధిత పోలీస్ అధికారులు, ఎస్.హెచ్.ఓలతో మాట్లాడి తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా విచారణ చేపట్టి, చట్టపరమైన విధి విధానాల ప్రకారం తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు భరోసా కల్పిస్తూ, అనవసరంగా సివిల్ వివాదాలలోకి వెళ్లకుండా చట్ట పరిధిలోనే చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ స్థానిక పోలీస్ స్టేషన్‌లలో సమస్యలకు పరిష్కారం లభించని సందర్భాల్లో ఎలాంటి ఒత్తిళ్లకు, ప్రలోభాలకు లోనుకాకుండా నేరుగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా పోలీస్ యంత్రాంగం ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని, న్యాయం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ డి.జానకి స్పష్టం చేశారు.

### క్రిమినల్ కేసులో రిమాండ్
## ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్

**ఉప్పునుంతల, డిసెంబరు 29 ప్రభాతవార్త :** మండలంలోని తాడూరు ఎంపి యూపీఎస్ పాఠశాలలో పనిచేస్తున్న ఎస్‌జీటీ ఉపాధ్యాయుడు రాత్లావత్ గోపి క్రిమినల్ కేసులో ఇరుక్కొని రిమాండ్‌కు వెళ్లిన నేపథ్యంలో ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి ఏ.రమేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. డిసెంబర్ 24న రాత్లావత్ గోపి క్రిమినల్ కేసులో రిమాండ్‌కు వెళ్లినట్లు అచ్చంపేట పోలీస్ శాఖ నివేదికతో పాటు, ఉప్పునుంతల మండల విద్యాశాఖాధికారి చంద్ర శేఖర్ ఇచ్చిన సమాచారాన్ని పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. క్రిమినల్ కేసులో ఇరుక్కోవడం ద్వారా ప్రభుత్వ ఉద్యోగ నిబంధనలను ఉల్లంఘించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ సివిల్ సర్వీసెస్ (సీసీఏ) నిబంధనల ప్రకారం 1991లోని రూల్ 8(1) ప్రకారం రత్లావత్ గోపిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. క్రమశిక్షణ చర్యలు పూర్తయ్యే వరకు ఆయన సస్పెన్షన్ కొనసాగుతుందని తెలిపారు. సస్పెన్షన్ కాలంలో సంబంధిత అధికారి అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్‌ను విడిచిపెట్టరాదని ఆదేశించారు. నిబంధనల ప్రకారం ఈ కాలంలో ఉపాధ్యాయుడికి జీవనోపాధి భత్యం (సబ్సిస్టెన్స్ అలవెన్స్) చెల్లించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## ఆధార్ బయో మెట్రిక్ నవీకరణ చేసుకోండి

### జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల డిసెంబర్ 29, ప్రభాతవార్త:** ఆధార్ కార్డులో 05 మరియు 15 సంవత్సరాల వయస్సు పూర్తయిన పిల్లలకు తప్పనిసరిగా బయోమెట్రిక్ నవీకరణ చేసుకోవాలనీ జిల్లా కలెక్టర్ బి. యం. సంతోష్ అన్నారు. భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ మార్గదర్శకాల ప్రకారం, ఈ వయస్సులలో పిల్లల వేలిముద్రలు , కంటి మణులు , ఫోటో మార్పులకు లోనవుతాయని దృష్టిలో ఉంచుకొని, ఆధార్ వివరాల ఖచ్చితత్వాన్ని నిలుపుకోవడానికి ఈ నవీకరణ అవసరమని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా లోని ఆధార్ సెంటర్ లలో తల్లిదండ్రులు/సంరక్షకులు తమ పిల్లల ఆధార్ నవీకరణను సమీపంలోని ఆధార్ నమోదు కేంద్రంలో సంబంధిత ధృవీకరణ పత్రాలతో తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. సకాలంలో బయోమెట్రిక్ నవీకరణ చేయించుకోకపోతే, భవిష్యత్తులో పాఠశాల ప్రవేశాలు, ప్రభుత్వ పథకాలు, పరీక్షలు, ఇతర సేవలలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్హత కలిగిన ప్రతి పిల్లవాడి ఆధార్ బయోమెట్రిక్ నవీకరణను వెంటనే పూర్తి చేయించుకోవాలని సంబంధిత అధికారులు అవగాహన కల్పించాలని, ఆధార్ నిర్వాహకులు పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# మహిళా ఆర్థిక అభ్యున్నతే లక్ష్యం

- రైస్ స్వచ్ఛంద సంస్థ ముందడుగు..
- మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ
- స్వయంకృషితో రాణిస్తున్న వైనం
- యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహణ



శిక్షణ తీసుకుంటున్న మహిళలు

**మహబూబ్‌గర్ (కోయిలకొండ), డిసెంబర్ 29 ప్రభాత వార్త:** ప్రభుత్వం ఓ వైపు మహిళలకు ఆర్థిక స్వావలంబన కలిగించేలా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. మహిళా సాధికారత కోసం కొత్త పథకాలు, కార్యక్రమాలు ప్రవేశపెడుతోంది. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుని, సొంతకాళ్లపై నిలబడేలా చర్యలు చేపడుతోంది. మరోవైపు స్వచ్ఛంద సంస్థలు కూడా తమ వంతుగా మహిళా ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్నాయి. ఇందులో భాగంగా రైస్ స్వచ్ఛంద సంస్థ మహిళలకు కుట్టు మిషన్ల అందజేసి ఉచిత శిక్షణ అందించి వారు ఆర్థికంగా బలపడేందుకు దోహదపడుతున్నది. మహిళల ఆర్థిక సాధికారతకు.. యునైటెడ్‌వే ఆఫ్ హైదరాబాద్.. వారి సహకారంతో రైస్ స్వచ్ఛంద సంస్థ కోయి లకొండ మండలంలో మహిళల సాధికారత కొరకు ఉచిత కుట్టు మిషన్ల శిక్షణ నేర్పించి మహిళల యొక్క ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతుంది. మహిళల ఆర్థిక సాధికారత దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుందని, మహిళలు ఆర్థికంగా స్వతంత్రులైతే, కుటుంబం, సమాజం, దేశం అభివృద్ధి చెందుతాయని విశ్వసించిన సంస్థ సభ్యులు మహిళలకు ఆర్థికంగా బలోపేతం అయ్యేలా వారికి అండగా నిలుస్తున్నారు. గతంలో 2023లో 30 మంది మహిళలు రైస్ స్వచ్ఛంద సంస్థలో శిక్షణ పొంది ఉచిత కుట్టు మిషన్ ను నేర్చుకుని సొంతంగా రెడీమేడ్ షాపును నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఉన్న ప్రతి మహిళ సుమారుగా 15 నుంచి 30 వేల వరకు సొంతంగా సంపాదిస్తున్నారు. అదేవిధంగా ఈ సంవత్సరం అభంగపట్నంలో 30మంది మహిళలు ఉచిత కుట్టు మిషన్ శిక్షణను నేర్చుకుంటున్నారు. ఈ సంవత్సరం అక్టోబర్ 7న ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమంలో అభంగపట్నం గ్రామంలో 30మంది మహిళలు కుట్టుమిషన్లు నేర్చుకుంటూ వారి ఉపాధిని మెరుగుపరుచుకుంటున్నారు. ప్రస్తుత కాలంలో ఉన్న ఆధునిక మహిళలు వ్యవసాయ పనులు రాక డిగ్రీల వరకు చదువుకొని ఇంటి దగ్గరే ఉంటున్నారు వారికోసం వారు సొంతంగా తమ కాళ్లపై తాము నిలబడేందుకు కుట్టుమిషన్ శిక్షణను నేర్చుకుంటున్నారు గతంలో నేర్చిన వారు సొంతంగా ఒక రెడీమేడ్ షాప్ ను కుట్టు మిషన్ ను నడుపుకుంటున్నారు.

### మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే లక్ష్యం



మహిళల ఆర్థిక సాధికారత దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుంది. యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సహకారంతో మా రైస్ స్వచ్ఛంద సంస్థ గ్రామీణ ప్రాంతంలో 18 నుండి 30 సంవత్సరాల లోపు ఉన్న మహిళలు ఆర్థికంగా ఎదగాలని సంకల్పంతో ఉచిత కుట్టు మిషన్ నేర్పించడం మరియు బ్ బ్యూటిషన్ కోర్సులో కంప్యూటర్ కోర్సులపై శిక్షణ ఇస్తూ వారి కాళ్ళపై వాళ్లు నిలబడేలా చేసేందుకు మా రైస్ సంస్థ తోడ్పడుతుంది.

– అమరేందర్ గౌడ్,
రైస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు

### నాకు గౌరవం పెరిగింది..



2023లో రైస్ స్వచ్ఛందసంస్థ ద్వారా మా గ్రామంలో రవీందర్‌రెడ్డి సార్ ఈ శిక్షణ ద్వారా నేను కుట్టుమిషన్‌ను నేర్చుకున్నాను. ప్రస్తుతం డ్రెస్సెస్ లేడీస్ కుర్తా బ్లౌసెస్ అన్నిరకాల వస్తువులను కుడు తున్నాను. దీంతో నాకు ఆర్థికంగా కొంత ధైర్యం వచ్చింది. నేను స్వతంత్రంగా డబ్బులు సంపాదించుకోగలుగుతున్నాను. నాకు సమాజంలోనూ గౌరవం పెరిగింది.

– పుష్పాంజలి

### నేను స్వతంత్రంగా బతుకుతున్న..



నా పెళ్లి ఈ సంవత్సరం అవుతుంది. నేను ఇంట్లోనే ఉండేదాన్ని. ఏ పని చేసేదాన్ని కాదు. రైస్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు నరేష్ రెడ్డి సార్, అమరేందర్ సార్ మా గ్రామంలో కుట్టు మిషన్ నేర్పిస్తున్నారు అని తెలుపడంతో నేను మా తోటి మా గ్రామంలో ఉన్న ఫ్రెండ్స్ 30 మంది మూడు నెలపాటు శిక్షణ నేర్చుకున్నాం. ప్రస్తుతం మేం ఐదు మంది కలిసి శిరీష గ్రూప్ ఆఫ్ టైలరింగ్ షాపును కుట్టు మిషన్ ను నిర్వహిస్తున్నాం. ఇక్కడ మేము 15,000 నుంచి 30,000 వరకు నెలకు సంపాదిస్తున్నాం. రైస్ సమస్య ద్వారా నా చుట్టుపక్కల వాళ్ళు అందరూ నాకు తెలిశారు. నన్ను గుర్తించగలుగుతున్నారు. స్వతంత్రంగా బతుకుతున్నందుకు చాలా ఆనందంగా ఉంది.

– శిరీష, కుట్టు మిషన్ రెడీమేడ్ షాప్ నివాహకులు



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ ఎన్.బి. రత్నం

### జనవరి 1 నుంచి 31 వరకు
## ఆపరేషన్ స్మైల్ అమలు

- బాలల అక్రమ రవాణా, బాల కార్మికత్వం,
- భిక్షాటన నిర్మూలనపై ప్రత్యేక దృష్టి
- సంబంధిత శాఖల అధికారులతో జిల్లా పోలీస్
- ప్రధాన కార్యాలయంలో సమన్వయ సమావేశం

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 29 ప్రభాత వార్త :** జిల్లా ఎస్పీ డి.జానకి ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు ఎస్పీ ఎన్.బి.రత్నం అధ్యక్షతన ఆపరేషన్ స్మైల్ నిర్వహణకు సంబంధించి సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ ఎన్.బి. రత్నం మాట్లాడుతూ, 2026 జనవరి 1 నుంచి జనవరి 31 వరకు జిల్లావ్యాప్తంగా ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఆపరేషన్ ద్వారా 14 సంవత్సరాల లోపు బాల బాలికలను పనిలో పెట్టుకున్న బాల కార్మికత్వం, భిక్షాటన చేయిస్తున్న సంఘటనలు, బాలల అక్రమ రవాణా, అక్రమ రక్షణ చర్యలను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రత్యేకంగా రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లు, మార్కెట్లు, పనివేళలు జరిగే ప్రాంతాలు, జనసమూహం గల ప్రదేశాల్లో విస్తృత తనిఖీలు చేపడతామని తెలిపారు. గుర్తించిన బాల బాలికలను సంబంధిత చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సిడబ్ల్యుసి) ద్వారా సంరక్షణ కేంద్రాలకు తరలించి, పునరావాస చర్యలు చేపడతామని అన్నారు. జిల్లాలోని ప్రజలు కూడా బాలల అక్రమ రవాణా, బాల కార్మికత్వం, భిక్షాటనకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేసి సహకరించాలని అదనపు ఎస్పీ గారు కోరారు. ఈ సమావేశంలో ఉమెన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సిడబ్ల్యూసీ చైర్మన్ నయీముద్దీన్, జేజేబీ సభ్యురాలు ఎస్టర్ గ్రేస్, డీఈఎంఓ మంజుల, డిసిపిఓ నర్మద, లేబర్ ఆఫీస్ అధికారులు, ఏహెచ్‌టీయూ సిబ్బందితో పాటు పలు ఎన్జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

### ప్రజావాణి ఫిర్యాదులను
## సత్వరమే పరిష్కరించాలి



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల డిసెంబర్ 29, ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 82 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఇట్టి ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావులతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వైకల్యం అనేది శరీరానికే కానీ... లక్ష్య సాధనకు కాదు

- లక్ష్యాలను సాధిస్తూ స్ఫూర్తిదాయకంగా
- ఉంటూ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి
- దివ్యాంగుల సమస్యలు పరిష్కరించేందుకు
- ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమం
- దివ్యాంగుడు అశ్విన్ బాలుని ప్రతిభను
- అభినందించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి, డిసెంబరు29 ప్రభాతవార్త:** వైకల్యం అనేది శరీరానికి మాత్రమే కానీ తాము అనుకున్న లక్ష్యాలసాధనకు కాదని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. సోమవారం వనపర్తి పట్టణంలోని దాచే లక్ష్మయ్య ఫంక్షన్‌హాల్‌లో జిల్లాసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ దివ్యాంగులకు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేయడమే కాకుండా క్రీడల్లో రాణించిన విజేతలకు బహుమతులను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులకు చాలా పట్టుదల మంచి స్ఫూర్తి ఉంటుందని దానివల్లనే సకలాంగులతో సమానంగా దివ్యాంగులు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని తెలియజేశారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం వాస్తవంగా డిసెంబర్ 3న నిర్వహించుకోవాల్సి ఉందని కానీ ఎన్నికల ప్రవర్తన నియమాలు దృష్ట్యా ఈరోజు వేడుకలు నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. దివ్యాంగుల సమస్యలు పరిష్కరించడానికి జనవరి 2026 మాసంలో ఏదో ఒక రోజు ప్రత్యేకంగా దివ్యాంగులకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి వారి సమస్యలు పరిష్కరించడం జరుగుతుందనీ తెలియజేశారు. త్వరలోనే ప్రత్యేక ప్రజావాణి తేదీని తెలియజేస్తామని చెప్పారు. దివ్యాంగుల కమిటి వారి సమస్యల పట్ల ఇచ్చిన సూచనలు ప్రభుత్వం దృష్టికీ తీసుకువెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. దివ్యాంగులు తనవైకల్యాన్ని అధిగమించి అన్ని రంగాల్లో రాణిస్తూ స్ఫూర్తిదాయకంగా ఉంటూ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

**దివ్యాంగుడు అశ్విన్ బాలుడి ప్రతిభను అభినందించిన జిల్లా కలెక్టర్...**

బాలానగర్ ప్రభుత్వ పాఠశాలలో రెండవ తరగతి చదువుతూ చదువులో ప్రతిభ కనబరుస్తున్న అశ్విన్‌తండ్రిపేరు యాదగిరి ప్రతిభాభను చూసి కలెక్టర్ ముగ్ధుడయ్యారు. కేవలం రెండవ తరగతి చదువుకుంటున్న బుడతడు రాష్ట్రం పేరుచెబితే రాజధాని పేరు, రాజధాని పేరు చెబితే రాష్ట్రం పేరు వెంటనే చెప్పేస్తున్నారు. అతని జ్ఞాపకశక్తికి కలెక్టర్ అభినందనలు తెలిపి సన్మానించారు. జిల్లా సమాఖ్య సభ్యులను కలెక్టర్ శాలువా, మెమెంటోతో సన్మానం చేశారు. దివ్యాంగుల క్రీడలో గెలుపొందిన క్రీడాకారులను మెమెంటో, ప్రశంసా పత్రాలు అందజేశారు. అంధులకు ప్రత్యేక పాఠశాల ఏర్పాటు చేయాలని, ఆర్థిక సాధికారత సాధించేందుకు అర్హులైన దివ్యాంగులకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని, ప్రతి మూడు నెలలకు ఒకసారి దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి సమీక్ష సమావేశాలు నిర్వహించాలని దివ్యాంగుల కమిటి అధ్యక్షులు మీసాల మోహన్, మధు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, అడిషనల్ డిఆర్డీఓ సరోజ, మానసిక వైద్యులు డా.పుష్ప, తహసిల్దార్ రమేష్ రెడ్డి , సిడిపిఓ లు, సూపర్‌వైజర్లు, దివ్యాంగులు పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోలు గోల్‌మాల్

- డాటా ఎంట్రీ ఆపరేటర్, రైస్ మిల్ ఓనర్ కుమ్మక్కు
- 14 లక్షల 50 వేలు ఫ్రాడ్



కల్లాలలో పోసిన వరికుప్పలు

**వీపనగండ్ల డిసెంబర్ 29, ప్రభాతవార్త;** వడ్లు లేకుండానే రైస్ మిల్ ఓనర్ డాటా ఎంట్రీ ఆపరేటర్ కుమ్మక్కై 14 లక్షల 50 వేల రూపాయలను ఐదు మంది రైతుల పేరు మీద వారి ఖాతాలో వేసుకొని ఫ్రాడ్ కు పాలు పడ్డట్లు తెలిసింది. మండలంలోని గోపాల్దిన్నె గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో వరి కొనుగోలు చేస్తున్న విషయము తెలిసింది. అయితే బుక్కిపరుకు తెలియకుండానే డాటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్ రెండు లారీలు గోపాల్దిన్నె సెంటర్లో కాంటా తూకం కాకుండానే గద్వాల ఇమాన్ రైస్ మిల్‌కు పంపినట్లు సృష్టించారు. ఆ పంపిన లారీల వడ్లకు ధర్మ కంట ద్వారా తూకం చేసినటువంటి రసీదు ఏమైనా ఉన్నదా అని రైస్‌మిల్ ఓనర్‌ని డివో అడగగా ఆ రసీదు లేదు కానీ నా రైస్ మిల్ కు రెండు లారీల వడ్లు వచ్చినది వాస్తవం అని డివో ఈ సమాచారం తెలుసుకొని అతని అడగగా పై విషయం తెలిసిన తెలిపినట్లు వనపర్తి డివో తెలిపారు. అయితే అతన్ని రసీదు తీసుకొని వనపర్తి ఆఫీస్‌లో కలవమని అతనికి తెలియజేసినట్లు ఆయన తెలిపారు. అయితే ఐదుమంది పేర్లమీద డబ్బులు వారి ఖాతాలో పడ్డాయి. ఆ పడ్డ డబ్బులను ఈ జగదీష్ అనే డాటా ఎంట్రీ ఆపరేటర్ ఖాతాలోకి ఫోన్ పే ద్వారా రైతుల నుండి వచ్చినట్లు సమాచారం అయితే ఈ తతంగం అంతా వారం రోజుల నుండి జరిగినట్లు సమాచారం స్వయంగా అతనే కలెక్టరేట్లో వడ్లకు సంబంధించి రైతుల ఖాతాలోకి డబ్బులు మార్చే వ్యక్తి దగ్గర నుండి వారికి అనుకూలంగా ఉన్న రైతుల ఖాతాలోకి మళ్లించినట్లు సమాచారం ఈ విషయం బుక్కు కీపర్ తెలుసుకొని పై అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. రైతులు కావలి జగదీష్ అంటే ఇతనే డాటా ఎంట్రీ ఆపరేటర్ –మిగతా4లో..

### నా లాగిన్ నా నియమం" తో
## సైబర్ మోసాలకు ఫుల్‌స్టాప్

- వనపర్తి సైబర్ ఎస్సై రవిప్రకాష్
- ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్ - 4వ వారంలో
- సైబర్ భద్రతకు కీలక ముందడుగు
- పోలీసులే ముందుగా అప్రమత్తులైతేనే ప్రజలకు భద్రత
- ప్రతి లాగిన్ వెనుక బాధ్యత ఉండాలి ఇదే లక్ష్యం
- ఒక్క క్షణం నిర్లక్ష్యం జీవితకాల బాధగా మారవచ్చు



సైబర్ అవగాహన
పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ రవి ప్రకాష్

**వనపర్తి, డిసెంబరు 29 ప్రభాతవార్త :** ఫ్రాడ్‌కా పుల్ స్టాప్ కార్యక్రమంలో భాగంగా 4వవారం నా లాగిన్ నా నియమం" అనే థీమ్‌తో సైబర్ నేరాలపై అవగాహన కల్పించే ప్రత్యేక కార్యక్రమాన్ని వనపర్తి జిల్లా పోలీసులకు అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ సునీత రెడ్డి, ఆదేశాల మేరకు సోమవారం జిల్లాపోలీసు కార్యాలయం సమావేశ భవనంలో ఈఅవగాహన కార్యక్రమం నిర్వ హించబడింది. ఈకార్యక్రమాన్ని సైబర్ సెక్యూరిటీ ఎస్సై రవిప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించి, వనపర్తి జిల్లాలోని పోలీసు సిబ్బంది, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బందికి ప్రత్యక్ష అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టిజిసిఎస్‌బి (తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో) – మిగతా4లో..

## విద్యార్థులను అభినందించిన కలెక్టర్

**బిజినేపల్లి, డిసెంబరు 29 ప్రభాతవార్త:** జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనలో కారుకొండ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అభినందించారు. కారుకొండ పాఠశాల విద్యార్థులు, గైడ్ టీచర్లు కలిసి తయారుచేసిన ఇన్‌స్పైర్ విభాగంలో వ్యవసాయ రంగంలో రోబోలు అనే అంశం , సైన్స్ ఫేర్‌లో సుస్థిర వ్యవసాయ అభివృద్ధి, సేంద్రియ వ్యవసాయం అంశాలకు సంబంధించిన మొత్తం 3 ప్రాజెక్టులు ప్రదర్శించినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులను కలెక్టర్ చూసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రఘునందన్ శర్మ, ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, శ్రీకాంత్, చైతన్య విద్యార్థులు నిహారిక, వైష్ణవి, మధు, అభిలాష్ పాల్గొన్నారు.


విద్యార్థుల ప్రదర్శనను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

## బాల్య వివాహాలపై అవగాహనా సదస్సు

**దామరగిద్ద, డిసెంబరు 29 ప్రభాతవార్త :** దామరగిద్ద మండలం కేంద్రంలో న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వాలంటీర్ పి.కృష్ణవేణి మాట్లాడుతూ ఆడపిల్లలకు చిన్నతనంలో పెళ్లిళ్ల చేస్తే చట్టరీత్యా నేరం జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని కావున ప్రతి ఆడపిల్లకి 18 సంవత్సరాలు అబ్బాయిలకు 21 సంవత్సరం నిండిన తర్వాతనే పెళ్లి చేయాలని తెలిపారు. ఈ సమాజంలో ఆడ, మగ ఇద్దరు సమానమే కావున వరకట్న వేధింపులు, గృహ హింసల ద్వారా ఎవరైనా బాధపడుతున్న చెప్పండి దానికి పరిష్కార మార్గము ఉంటుంది అని చెప్పారు. ముఖ్యంగా మహిళలు లీగల్ సమస్యలు ఉన్నచో న్యాయ సేవా సంస్థ వాళ్ళని సంప్రదించవచ్చని ప్రకటనలో తెలిపారు. ఆడపిల్లలపై సమాజంలో జరుగుతున్న నేరాలు, ఘోరాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని వివరించడం జరిగింది. ముఖ్యంగా అక్షరాస్యత చాలా అవసరం. ప్రతి మహిళ గ్రాడ్యుయేట్ అయి ఉండాలి సమాజంలో జరుగుతున్న వాటిపై కనీసం పేపర్ చదివి అవగాహన కలిగి ఉంటే మంచిదని కోరారు. ఇప్పుడు ఎన్నో ఓపెన్ స్కూల్ ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొనడం జరిగింది.

## కల్వకుర్తి సబ్ డివిజనల్ పోలీస్ అధికారులతో వార్షిక క్రైమ్‌పై సమీక్ష

**-జిల్లా అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు**

**కల్వకుర్తి, డిసెంబర్ 29 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ సబ్ డివిజనల్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో క్రైమ్ పరిస్థితులపై సమీక్ష సమావేశాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు నిర్వహించారు. సబ్ డివిజన్ వారీగా క్రైమ్ కేసులను పరిశీలిస్తూ, ఇటీవల నమోదైన వివిధ రకాల కేసుల విచారణ పురోగతిపై సమీక్షించారు. విచారణలు సమయానికి పూర్తి చేసి న్యాయపరమైన చర్యలు వెంటనే తీసుకోవాలని, ఆలస్యం లేకుండా ప్రజాభద్రతకు సంబంధించిన అంశాల్లో కఠినంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. కేసుల నమోదు నుండి దర్యాప్తు వరకు ప్రతి దశలో పారదర్శకత పాటిస్తూ, ప్రజల నమ్మకాన్ని పెంపొందించేందుకు కృషిచేయాలని అదనపుఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు. నాణ్యమైన దర్యాప్తుతో నేరస్థులను శిక్షించడమేకాకుండా, నేరస్తులు కానీ వారిహక్కులను కాపాడటం పోలీసుల బాధ్యత అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ సమీక్ష సమావేశంలో కల్వకుర్తి సబ్ డివిజన్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, సీఐలు నాగార్జున, విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్ఐలు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ

## సెల్ టవర్ ఏర్పాటుపై ప్రజావాణిలో ఫిర్యాదు

**వనపర్తి, డిసెంబరు 29 ప్రభాతవార్త :** వనపర్తి పట్టణంలోని రాయిగడ్డ 1వ వార్డు కాలనీలో సెల్ ఫోన్ టవర్ ఏర్పాటును నిరసిస్తూ ప్రజావాణిలో కలెక్టర్ కు కాలనీవాసులు ఫిర్యాదు చేయడం జరిగింది. నివాస ప్రాంతాల మధ్య సెల్ టవర్ నిర్మించడం వల్ల వెలువడే రేడియేషన్ వల్ల చిన్నపిల్లలు.. వృద్ధులకు అనారోగ్య. సమస్యలు ..క్యాన్సర్ లాంటి సమస్యలు తలెత్తుతాయని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కలెక్టర్‌ను కోరారు. గతంలో టవర్ ఏర్పాటు ఆపాలని మున్సిపాలిటీలో కమిషనర్ కు ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. సెల్ టవర్ వల్ల ప్రజలు ప్రాణాలకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉన్నందున్న ఎట్టి పరిస్థితుల్లో టవర్ నిర్మాణాన్ని ఆపాలని కాలనీ వాసులు కలెక్టర్‌ను కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో కాంగ్రెస్ నాయకులు మండ్ల దేవన్న నాయుడు, చుక్క రాజు, సంతోష్ కుమార్, జెటి నరేష్, పూజారి శివకుమార్, కాలనీవాసులు టైలర్ శ్రీను, గుజ్జుల శీను, వేణుగోపాల చారి, కిరణ్, మహిళలు చందన, శ్రీలత, శ్రీనివాసులు చారి, పార్వతమ్మ, నరేష్. కిరణ, విరాట్ , నరేష్ , 1వ వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


ప్రజావాణిలో కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తున్న కాలనీవాసులు

## డోలు బాలరాజుపై దాడి

**మాదాసి కురువ సమాజంపై దాడిగానే భావిస్తున్నాం : కురువ నవీన్**

**ధన్వాడ, డిసెంబరు 29 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ధన్వాడలో రైతు అనుమతి లేకుండా పొలంలో కరెంట్ స్తంభాలు నాటడంపై ప్రశ్నించినందుకు కురువ డోలు బాలరాజు గారిపై జరిగిన దాడిని యావత్తు మాదాసి కురువ సమాజంపై జరిగిన దాడిగా భావిస్తున్నామని మాదాసి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం నేత కురువ నవీన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎదురు తిరిగితే ఇంటిని కూల్చేస్తామని భయభ్రాంతులకు గురిచేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని పేర్కొన్నారు. బాలరాజుపై జరిగిన దాడి రేపు మరొకరి ఇంటిపై కూడా జరగవచ్చని హెచ్చరించారు. ఇప్పటికైనా సమాజం మేలుకొని రాజకీయంగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ ఘటనపై తక్షణమే ఎమ్మెల్యే పీప చిట్టెం మాధవ రెడ్డి డోలు బాలరాజుకు మరియు రాష్ట్ర మాదాసి కురువ సంఘానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బాలరాజుకు న్యాయం జరగకపోతే రాష్ట్ర మాదాసి కురువ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అలాగే ఈ అంశాన్ని త్వరలోనే రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని ఆయన తెలిపారు. మాదాసి కురువలను తక్కువగా చూస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

## ఖానాపూర్ గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తాం

**నూతన యువ సర్పంచ్ పూజారి శేఖర్, ఉప సర్పంచ్ సభావట్ శంకర్**

**రాజాపూర్,డిసెంబరు 29 ప్రభాతవార్త :**తమ గ్రామపంచాయతీలో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తామని రాజాపూర్ మండలం ఖానాపూర్ గ్రామ నూతన యువ సర్పంచ్ పూజారి శేఖర్,ఉపసర్పంచ్ సభావట్‌శంకర్ పేర్కొన్నారు.సోమవారం ఈ మేరకు వార్త ప్రతినిధితో వారు ఇరువురు మాట్లాడుతూ చిన్న వయసులోనే తమకు సర్పంచ్,ఉపసర్పంచ్‌గా అవకాశం రావడం సంతోషంగా భావిస్తున్నామని,తమ విజయానికి కృషి తమకు ఈ పదవులు అప్పజెప్పడంతో బాధ్యత మరింత పెరిగిందని, గ్రామ నాయకుల, గ్రామ పెద్దల, గ్రామ ప్రజల, సహాయ సహకారాలు, వారి సూచనలు, సలహాలు తీసుకొని గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. చిన్నతనంలోనే వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అభివృద్ధికి కృషి చేస్తామని ఈ సందర్భంగా సర్పంచ్ పూజారి శేఖర్ ముదిరాజ్, ఉపసర్పంచ్ సభావట్ శంకర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఉపాధి హామీ పనులను ప్రారంభం

**వడ్డేపల్లి, 29 డిసెంబరు ప్రభాతవార్త :** జూలకల్లు గ్రామం వడ్డేపల్లి మండలం జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండల పరిధిలోని జూలకల్లు గ్రామ శివారులో పవులన్నదొడ్డి నుండి శివాలయం వరకు ఉన్న మట్టి రోడ్డును నేడు సర్పంచు జి.రాజు, ఉపసర్పంచ్ యు.సోమశేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జయశంకర్, బి.రాజు, వినోద్ కుమార్, పంచాయతీ సెక్రెటరీ మేడం టెక్నికల్ అసిస్టెంట్ భాస్కర్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.


పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్, ఉపసర్పంచ్

## బిజెపి హటావో దేశ్ బచావో నినాదంతో
# ఉపాధి హామీ కూలీలు నిరసన

**కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ అధ్యక్షులు రాచమల్ల సిద్ధిశ్వర్**

**శ్రీరంగాపూర్, డిసెంబరు 29 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో సోమవారం టిపిసిసి అధిష్టానం పిలుపుమేరకు ఉపాధి హామీ కూలీలతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ అధ్యక్షులు రాచమల్ల సిద్దిశ్వర్ పాల్గొనడం జరిగింది. రాచమల్ల సిద్ధిశ్వర్ మాట్లాడుతూ సత్యం, అహింసలతో దేనినైనా సాధించవచ్చు అని నిరూపించిన జాతిపిత మహాత్మా గాంధీ ఆయన అడుగుజాడల్లో నడిచి ఆయన కలలుగన్న భారతదేశా న్ని నిర్మించే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపు పలికారు. గ్రామీణ ప్రజలు అర్థాకలితో అలమటిస్తున్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఆనాటి దివంగత ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు సోనియా గాంధీ నేతృత్వంలో చేపట్టిన గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించడం జరిగింది. గ్రామీణ ప్రజలకు ఆర్థికంగా అండగా ఉంటుందని భావించి 2005లో గ్రామీణ ఉపాధి హామీ పథకం రూపు దాల్చింది అన్నారు. ఈ పథకం ద్వారా రైతులకు నిరుపేదలకు ఆసరాగా నిలిచిందన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం చేస్తున్న కుట్రలు సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. పేదల సంక్షేమం కోసం చేసే ప్రయత్నాలు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే మరోవైపు బిజెపి ప్రభుత్వం ధనవంతులను పెంచి పోషిస్తుందన్నారు. దూర దృష్టితో ప్రజలకు సంక్షేమం అందించడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. రాజేంద్రప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పై కేంద్రం చేస్తున్న కుట్రలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకొని పోతామని అన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలో ఉందన్న అహంకారంతో కాంగ్రెస్ అధిష్టానం పై కుట్రలు చేస్తుందన్నారు. ప్రజాస్వామ్యంలో కుట్రలు చేసే పన్నాగాలు ఎప్పుడు నిలబడలేదని మొన్న జరిగిన అక్రమ కేసులను కొట్టివేస్తూ అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. అనంతరం బిజెపి హటావో దేశ్ బచావో అంటూ నినాదం చేస్తూ కూలీలతో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్ యాదవ్ టీపీసీసీ బీసీ విభాగం ఉపాధ్యక్షులు శ్రీరంగాపూర్ గ్రామ సర్పంచ్ ఎం. మద్దిలేటి, మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొక్కలయ్య, శ్రీరంగాపురం మండల రైతు కమిటీ అధ్యక్షుడు పి రాముడు, వెంకటాపూర్ సింగిల్ విండ్ డైరెక్టర్ శ్రీనివాస్ గౌడ్ , శ్రీరంగాపురం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గంగాధర్ యాదవ్, శ్రీరంగాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ సొప్పరి రమేష్, మాజీ ఉపసర్పంచ్ మహేష్ గౌడ్, మాజీ వార్డు మెంబర్ గంగన్న, జావీద్, కుమ్మరి నాగన్న, ఇమ్రాన్,ప్రవీణ్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామీణ ఉపాధి కమిటీ మెంబర్స్, కూలీలు, వివిధ గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి హామీ కూలీలతో కలిసి నిరసన తెలుపుతున్న దృశ్యం


ఉపాధి హామీ కూలీలతో కలిసి నిరసన తెలుపుతున్న దృశ్యం

## ప్రవీణ్‌కు నివాళులు అర్పించిన మండల అధికారులు

**నవాబుపేట, డిసెంబరు 29 ప్రభాతవార్త :** కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్ కుమార్(38) ఆదివారం గుండె పోటుతో మృతి చెందారు. ఈ సందర్భంగా మండల కార్యాలయ సిబ్బంది ప్రవీణ్ కుమార్ చిత్రపటానికి పూలమాలవేసి నిల నివాళులర్పించారు. ప్రవీణ్ కుమార్ ఉపాధిహామీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. కాగా ఆదివారం ఉదయం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించాడు. తెలుసుకున్న ఉపాధిహామీ అధికారులు, సి బ్బంది ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. అందరితో కలివిడిగా ఉండే ప్రవీణ్ మృతి విషయాన్ని సిబ్బంది జీర్ణించుకో లేక పోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడివో జయరాం నాయక్, ఎంపీవో బద్రు నాయక్‌తో పాటు ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది సహ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్, ఉప సర్పంచ్‌కు సన్మానం

**దామరగిద్ద, డిసెంబరు 29 ప్రభాతవార్త :** దామరగిద్ద మండల కేంద్రంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ కనికిరెడ్డి, ఉప సర్పంచ్ సత్తి సత్యనారాయణకు అలాగే వార్డు మెంబర్లకు, పెద్దింటి మహాదేవ్ సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహాదేవ్ మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని కోరారు.

## వైకుంఠ ఏకాదశికి ముస్తాబు

**చిన్నచింతకుంట,డిసెంబరు29 ప్రభాతవార్త:** తిరుమల తిరుపతి వెంకటేశ్వరుడి ప్రతిరూపంగా కొలవబడుతున్న శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానంలో మంగళవారం ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామివారి ప్రధానాలయంలో ఉత్తర ద్వార దర్శనాన్ని ఏర్పాటుచేశారు. ఈముక్కోటి ఏకాదశి రోజున ఉత్తరద్వారా దర్శనంద్వారా శ్రీదేవి, భూదేవి, సమేత శ్రీనివాసుని దర్శించుకుంటే సకల పాపాలు తొలుగుతాయని భక్తుల విశ్వాసం. ఈముక్కోటి ఏకాదశి పర్వదినాన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకుని పునీతులు కావాలని ఆలయ ఈవో మదనేశ్వర్ రెడ్డి, దేవస్థానం చైర్మన్ గోవర్ధన్ రెడ్డిలు ఒక ప్రకటనలో కోరారు.

## యువజన కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడిగా వడ్డే రాజు

**దామరగిద్ద, డిసెంబరు 29 ప్రభాతవార్త :** యువజన కాంగ్రెస్ దామరగిద్ద గ్రామ అధ్యక్షుడిగా వడ్డే రాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నాకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డికి, మాజీ డిసిసి అధ్యక్షుడు కుంభం శివ కుమార్‌రెడ్డి కి దామరగిద్ద మండల కాంగ్రెస్ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ నన్ను నమ్మి నా కోసం నిలబడ్డ యువకుల సహకారంతో ఈ రోజు ఈ గుర్తింపు రావడం జరిగింది అని తెలిపారు. యువతే పార్టీకి కీలకమన్నారు. యువత పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించాలని, పార్టీ పటిష్ఠతకు కృషి చేస్తానని తెలిపారు.

## ఇందిరమ్మ చీరల పంపిణీ

**మద్దూరు, డిసెంబరు 29 ప్రభాతవార్త :** మద్దూరు మండల పరిధిలోని నిర్జింత గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ రజిత శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రజిత శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కట్టుబడి ఉందని తెలిపారు. మహిళల గౌరవం, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుజాత అంజయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తిరుపతి రెడ్డి, కృష్ణారెడ్డి, విజయ్ కుమార్, బాలరాజ్, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ గ్రామ పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# పోలీస్-ప్రాసిక్యూషన్ సమన్వయంతో న్యాయం

**ఆత్మకూర్ ప్రథమ న్యాయమూర్తి తీర్పు**

**నేరం చేసినవారు శిక్ష నుంచి తప్పించుకోలేరు" డీఎస్పీ**

**వనపర్తి, డిసెంబరు 29 ప్రభాతవార్త:** ఒక వ్యక్తిని కొట్టి తీవ్రంగా గాయపరిచిన ఘటనలో నేరం రుజువైన ముగ్గురు నిందితులకు మూడు (3) నెలల జైలు శిక్షతో పాటు రూ.1,000 చొప్పున మొత్తం రూ.3,000/ జరిమానా విధిస్తూ ఆత్మకూర్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి జె. శిరీష సోమవారం తీర్పు వెలువరించినట్లు వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. అమరచింత పోలీస్‌స్టేషన్ పరిధిలో 08082019 న ఉదయం 6:00 గంటల సమయంలో, ఫిర్యాదుదారు ఎస్. అనిమిరెడ్డి ఆయన తమ్ముడు ఎస్. భీమ్ రెడ్డిలపై, పొలాల వద్ద జరిగిన గొడవలో ఎ1: వంకోల్ల నల్లారెడ్డి,ఎ2: వంకుల్ల సల్వన్న, ఎ3: పెద్ద వెంకటన్నేతులతో పాటు కట్టెలతో దాడి చేసి గాయపరిచినట్లు ఫిర్యాదు నమోదైంది. ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై రామస్వామి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ప్రస్తుత ఎస్సై స్వాతి ఆదేశాల మేరకు కోర్టు డ్యూటీ ఆఫీసర్ జి. బాలరాజు సాక్షులను సమర్పించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ అరుణోదయ కుమార్ సమర్థవంతంగా వాదనలు వినిపించడంతో నేరం నిరూపితమైంది. దాడి చేసి గాయపరిస్తే శిక్ష తప్పదని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ కేసులో నిందితులకు శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్, కోర్టు డ్యూటీ ఆఫీసర్లను డీఎస్పీ అభినందించారు. త్వరలోనే రివార్డులు అందజేస్తామని తెలిపారు. సమాజంలో నేరం చేసినవారు ఎవరు కూడా శిక్ష నుంచి తప్పించుకోలేరు. ప్రజలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోరాదు. పోలీసులు ప్రాసిక్యూషన్ సమన్వయంతో వ్యూహాత్మకంగా విచారణ జరిపి న్యాయ నిరూపణ ద్వారా కచ్చితంగా శిక్షలు పడేలా చేస్తామని తెలిపారు.

## ప్రజావాణికి రెండు దరఖాస్తులు : కౌకుంట్ల ఎంపీడీవో

**దేవరకద్ర, డిసెంబరు 30 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం నిర్వహించిన ప్రజావాణికి రెండు దరఖాస్తులు అందినట్లు ఎంపీడీవో శివప్రసాద్, ఇంచార్జ్ తాహసిల్దార్ ఆంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఓసి, మైనార్టీల ఇళ్ల స్థలాల 57 ప్లాట్లు నక్ష ప్రకారం ప్లాట్ లకు పట్టా కాగితాలు ఇవ్వడం జరిగింది. ఇట్టి భూమిపై కేసులు ఉన్నాయని మభ్యపెడుతున్నారు. అయినా ఇట్టి సర్వే నెంబర్ 435/ఏ పై ఎటువంటి కేసులు లేనందున, డి2/52 56/82 ప్రకారం 57 ప్లాట్లను మాకు చూపించాలని కౌకుంట్ల మండల ఇండ్ల పట్టాదారులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అదేవిధంగా ముస్లింల (సమాధుల ప్రదేశం),సమాధులకు దారి చూయించాలని, కౌకుంట్ల మైనార్టీ ముస్లిం సోదరులు ప్రజావాణికి ఫిర్యాదు చేశారు. అనంతరం తహసిల్దార్, మండల అధికారులు మాట్లాడుతూ ఇండ్ల స్థలాల ఫైల్ కలెక్టర్ కార్యాలయంలో ఉంది. ఆ ఫైల్ తీసుకొచ్చి చూసి పరిష్కరిస్తామన్నారు. అదేవిధంగా ముస్లింలకు దక్కాల్సిన (ఖబ్రస్తాన్) సమాధుల బాట గురించి సర్వేర్ ద్వారా సర్వే చేయించి ముస్లింలకు బాట వచ్చేటట్లు చూస్తామన్నారు. ప్రజావాణితో ప్రజా సమస్యల పరిష్కారం లభిస్తుందని అధికారులు తెలిపారు.



సమాధుల బాట గురించి ముస్లిం సోదరులు అధికారులకు ఇచ్చిన దరఖాస్తు

## గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**నారాయణ పేట, డిసెంబరు 29 ప్రభాతవార్త :** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి ఆయా గురుకులాల్లో ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుంచి ఉమ్మడి ప్రవేశ పరీక్ష రాసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ నాగమణిమాల తెలిపారు. ఈ సందర్భంగా ప్రవేశ పరీక్షకు సంబంధించిన కరపత్రాలను ఆమె ఆవిష్కరించారు ఆమె మాట్లాడుతూ,ఎస్సీ,ఎస్టీ,బీసీ,జనరల్ గురుకులాల్లో ఐదో తరగతి ప్రవేశాలతో పాటు ఆరో నుంచి తొమ్మిదో తరగతు ల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి ఉమ్మడి ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులు 2026 జనవరి 21 లోగా ఆన్లైన్ ద్వారా సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు దరఖాస్తుతో పాటు విద్యార్థుల ఆదాయ ధ్రువీకరణ పత్రం,కుల ధ్రువీకరణ పత్రం,ఆధార్ కార్డు, బోనఫైడ్ సర్టిఫికేట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, విద్యార్థి సంతకం తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఆయా తరగతుల్లో ప్రవేశాలు పొందేందుకు ఫిబ్రవరి 22న ఉమ్మడి ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు ప్రభుత్వ గురుకులాల్లో నాణ్యమైన విద్యతో పాటు వసతి, భోజనం,పుస్తకాలు,యూనిఫాం వంటి సదుపాయాలు ఉచితంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కోఆర్డినేటర్ నాగమణిమాల కోరారు.

## కందుల కొనుగోలు వెంటనే ప్రారంభించాలి

**భారతీయ కిసాన్ సంఘ్ డిమాండ్**

**నారాయణ పేట, డిసెంబరు 29 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా భారతీయ కిసాన్ సంఘ్ కార్యాలయంలో మంగళవారం ఉ ట్కూర్, నారాయణపేట, దామరగిద్ద, ధన్వాడ, మక్తల్ మండలాల కు చెందిన రైతులు సమావేశమై కందుల కొనుగోలును వెంటనే ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత వారం జిల్లా కమిటీ ద్వారా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు కొనుగోలు ప్రారంభించకపోవడాన్ని రైతులు తీవ్రంగా తప్పుబట్టారు. ఈ ప్రాంతంలో గత సంవత్సరాల్లో డిసెంబర్ మొదటి వారంలోనే కందుల కొనుగోలు ప్రారంభమయ్యేదని, ఈసారి అధికారులు నిరక్ష్యం చేయడంతో రైతులకు అపారమైన నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వ్యవసాయ మార్కెట్లలో కందులు ప్రైవేటుగా క్వింటాలుకు రూ.6,000 నుంచి రూ.7,000 వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, దీంతో రైతుకు ప్రతి క్వింటాలుకు సుమారు రూ.2,000 నష్టం వాటిల్లుతోందని తెలిపారు. మెట్ట ప్రాంతమైన నారాయణపేట జిల్లా తెలంగాణలోనే తొలుత కందుల పంట కోతలు ప్రారంభమయ్యే ప్రాంతమని, ఇక్కడ పత్తి, కందులకు రైతులు అధిక ప్రాధాన్యం ఇస్తారని పేర్కొన్నారు. ఆరుగాలం కష్టపడి ఆరు నెలలు పండించిన పంటను సరైన సమయంలో కొనుగోలు చేయకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కందులకు మద్దతు ధర పెంచినప్పటికీ, అధికారులు ఆలస్యం చేయడం వల్ల ఈ ప్రాంత రైతులకు ఆ ప్రయోజనం అందడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మార్క్‌ఫెడ్ ద్వారా వెంటనే కందుల కొనుగోలు ప్రారంభించాలని, లేకపోతే మంగళవారం నుంచి ప్రతిరోజూ నిరసన కార్యక్రమాలు చేపడతామని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కమిటీ హెచ్చరించింది. కొనుగోలు ప్రారంభించే వరకు పోరాటాన్ని విరమించే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. ఈ సమావేశంలో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబా, జిల్లా కార్యదర్శి అనంత రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శాసమల బాలప్ప, జిల్లా సహ కార్యదర్శి మైపాల్ రెడ్డి, కోశాధికారి పటేల్ రంగారెడ్డి, మండల అధ్యక్షులు గణప్ప, శ్రీనివాస్, లక్ష్మీ క్రమకాంత్, కూర రాములు, ప్రవీణ్, గ్రామ అధ్యక్షుడు నర్సప్ప తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు

# తప్పుడు సమాచారంతో ఆశా వర్కర్లను ఇబ్బందులకు గురి చేయొద్దు

**నారాయణ పేట, డిసెంబరు 29 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా లోప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం తమ ఆరోగ్యాలను సైతం లెక్కచేయకుండా ప్రభుత్వ ఆరోగ్య శాఖలో నిరంతరం సేవలందిస్తున్న ఆశా వర్కర్లను పోలీసులు అనవసరంగా ఇబ్బందులకు గురి చేయడం దారుణమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బండమీది బాల్‌రామ్ విమర్శించారు. ఆశా వర్కర్లకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా ఎలాంటి చలో హైదరాబాద్ లేదా అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాలు లేనప్పటికీ, అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతున్నాయనే కారణంతో ఆశాలు చలో అసెంబ్లీకి వెళ్తున్నారనే తప్పుడు సమాచారంతో జిల్లాలో పోలీసులు ఆశాలను వేధిస్తున్నారని ఆరోపించారు. పైనుండి ఆదేశాలు వచ్చాయనే పేరుతో జిల్లాలోని అన్ని మండలాల్లో పోలీస్ స్టేషన్ల నుంచి ఆశా వర్కర్లకు ఫోన్లు చేయడం, వారి ఇండ్ల వద్దకు వెళ్లడం జరుగుతోందని తెలిపారు. ఎలాంటి కార్యక్రమాలు లేవని ఆశాలు స్పష్టంగా చెప్పినప్పటికీ వినకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. కొంతమంది ఆశా వర్కర్లను పోలీస్ స్టేషన్లకు రావాలని ఒత్తిడి చేసి సంతకాలు పెట్టించడమే కాకుండా మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి చర్యలు ఆశా వర్కర్ల గౌరవాన్ని దెబ్బతీయడమేనని, ప్రజారోగ్య సేవలకు భంగం కలిగిస్తాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఆరోగ్య శాఖలో కీలక పాత్ర పోషిస్తున్న ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఆశా వర్కర్లను ఇబ్బందులకు గురి చేయడం మానుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బండమీది బాల్‌రామ్ కోరారు.



పోలీస్ స్టేషన్ వద్ద ఆశా వర్కర్లతో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బండమీది బాల్‌రామ్

# వైజ్ఞానిక ప్రదర్శనలు నూతన ఆవిష్కరణలకు చక్కటి వేదిక

**- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్29 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ బాల వైజ్ఞానిక ప్రదర్శన సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ముఖ్య అతిథిగా హాజరై డీఈవో రమేష్ కుమార్‌తో కలిసి కలెక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రదర్శనలు నూతన ఆవిష్కరణలకు చక్కటి వేధికలన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే కొత్త ఆలోచనలపై దృష్టి సారించి సాంకేతిక రంగంలో ఎదగాలని సూచించారు. రోజురోజుకు సాంకేతిక రంగంలో అనేక మార్పులు వస్తున్నాయని, వాటికి అనుగుణంగా ఆలోచనలకు పదును పెట్టాలని తెలిపారు. సైన్స్ అంటేనే నిజమని, ప్రకృతిలో దాగి ఉన్న సత్యాలను సైన్స్ ద్వారా తెలుసుకోవచ్చని చెప్పారు. సైన్స్‌ను అలవర్చుకుంటే జీవితంలో ముందుకు వెళ్లగలమని పేర్కొన్నారు. నేటి రోజుల్లో దేశ విదేశాలకు విమానాల ద్వారా అతి తక్కువ సమయంలో ప్రయాణించగలుగుతున్నామంటే సాంకేతికత ఎంతగా అభివృద్ధి చెందిందో అర్థమవుతుందన్నారు. విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకొని ప్రతి అంశాన్ని పరిశోధనాత్మక దృష్టితో అర్థం చేసుకోవాలని సూచించారు. నేటి సమాజంలోని సమస్యలకు పరిష్కార మార్గం సైన్స్ ద్వారానే సాధ్యమవుతుందని, అది సృజనాత్మక ఆలోచనలతోనే సాధ్యమవుతుందని కలెక్టర్ తెలిపారు. కొత్త ఆవిష్కరణల ద్వారా ప్రతి రంగంలో అభివృద్ధి అంచెలంచెలుగా జరుగుతుందన్నారు. ప్రపంచం ఆధునిక సాంకేతికత వైపు వేగంగా సాగుతోందని, విద్యార్థులు సైన్స్‌లోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ వైజ్ఞానిక ప్రదర్శనకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్స్‌ను పరిశీలించి వాటికి సంబంధించి ప్రశ్నలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు 360 ప్రదర్శనలతో పాటు 93 ఇన్‌స్పైర్ ప్రదర్శనలు సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించిన ఉన్నట్లు తెలిపారు. అనంతరం డీఈవో రమేష్ కుమార్, జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్ రావు మాట్లాడుతూ సైన్స్‌పై పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. నాగర్ కర్నూల్ జిల్లా విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనల్లో పాల్గొని ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. బల్మూర్ పాఠశాల చెందిన విద్యార్థి గగన్ చందు యువ శాస్త్రవేత్త అవార్డును అందుకున్నట్లు, విద్యార్థులకు ఆలోచనలుఅనుగుణంగా సైన్స్ ఉపాధ్యాయులు బోధన పద్ధతులను నిర్వహించాలని, ప్రతి శాస్త్రవేత్త రూపొందించిన అంశాల పట్ల విద్యార్థులు పూర్తిస్థాయిలో తెలుసుకోవాలని, విద్యార్థులు తెలుసుకునేలా ఉపాధ్యాయుల కృషి చేయాలని డీఈఓ ఈ సందర్భంగా సూచించారు. కేజీబీవీ తాడూర్, కేజీబీవీ పెద్దకొత్తపల్లి, కేకే రెడ్డి పాఠశాల విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్‌రావు, నోడల్ అధికారికురుమయ్య, ఏసీ రాజశేఖర్ రావు, జిల్లా సెక్టోరియల్ అధికారులు కిరణ్ కుమార్, వేంకటేశ్వర్లు, వెంకటయ్య , నూరుద్దీన్, షర్ఫుద్దీన్, శోభారాణి, నర్సింహులు, శ్రీనివాస్ రెడ్డి, మండల విదాధికారులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రైవేటు పాఠశాలల యజమాన్యాలు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు కమిటీ సభ్యులు, విద్యార్థులు గైడ్ టీచర్లు పాల్గొన్నారు.



వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్

## ఇసుక తవ్వకాలు నిలిపి వేయాలని ఫిర్యాదు

**ఉప్పునుంతల, డిసెంబరు29 ప్రభాతవార్త:** తమ గ్రామ సమీపంలో ఉన్న దుందుభి వాగులో ఇసుక తవ్వకాలను సత్వరమే నిలిపి వేయాలని సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో దాసర్లపల్లి గ్రామ సర్పంచ్ రమేష్ రెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దుందుభి మండల పరిధిలోని దాసర్లపల్లి గ్రామ సమీపంలో ఉన్న దుందుభివాగులో ఇసుక తవ్వకాలు చేపడుతున్నారని ఆయన చేసిన ఫిర్యాదు లో పేర్కొన్నారు. ఇసుక తవ్వకాల వల్ల వాగు పరివాహక ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటిపోయాయని, దీంతో వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధిక లోడుతో ఇసుకను తరలించడం వల్ల గ్రామీణ రహదారులు పూర్తిగా దెబ్బతింటున్నాయని, రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని ఆయన ఫిర్యాదు లో పేర్కొన్నారు. అనుమతులు లేకుండా సరైన భద్రతా చర్యలు చేపట్టకుండా భారీ వాహనాల ద్వారా ఇష్టానుసారంగా ఇసుక రవాణా కొనసాగుతున్నఇసుక అక్రమరవాణాపై గతంలో ఎన్నిసార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎటువంటి స్పందన లేకపోవడం బాధాకరమని సర్పంచ్ రమేష్ రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి ఉన్నతాధికారులు స్పందించి దుందుభి వాగును ప్రత్యక్షంగా పరిశీలించి, ఇసుక తవ్వకాలు నిలిపి వేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలనిఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదుకుస్పందించినఉన్నతాధికారులు దాసర్లపల్లి గ్రామం వద్ద దుందుభి వాగును సత్వరమే సందర్శించాలని మైనింగ్ శాఖ అధికారులను ఆదేశించినట్లు వారు అందించిన ఫిర్యాదు లో పేర్కొన్నారు.

## నట్టల నివారణ మందు పంపిణీని సద్వినియోగం చేసుకోవాలి

**వెల్దండ, డిసెంబర్ 29 ప్రభాతవార్త:** పశువైద్య ఆధ్వర్యంలో మండల పరిధిలోని పోచమ్మ గడ్డ తండా గ్రామంలో గొర్రెలకు, మేకలకు మండల నట్టల మందు పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ మహిపాల్‌నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మూగజీవాలైన మేకలు గొర్రెలు ఆరోగ్యంగా ఉండాలంటే నట్టల నివారణ మందులు తప్పకుండా వేయించాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చంద్రకళ, గోపాల్, గోపాలమిత్ర మొగులయ్య, వార్డు సభ్యుడు రాత్లవత్ శ్రీరామ్, గోవర్ధన్, జైపాల్, చంద్య, సందీప్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## అధికారులను సన్మానించిన సర్పంచ్



**వెల్దండ, డిసెంబర్29 ప్రభాతవార్త:** మండల పరిధిలోని రాఘాయిపల్లి గ్రామ సర్పంచిగా నూతనంగా ఎన్నికైన సామ వెంకటయ్య సోమవారం మండల కేంద్రంలోని ఆర్డిఓ జనార్దన్‌రెడ్డి, తహసీల్దార్ కార్తీక్‌కుమార్, ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డిలను ఆయన కలిసి శాలువాలతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సర్పంచ్ పదవి ఎంతో ఉన్నతమైన పదవి అని బాధ్యతాయుతంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సింగిల్ విండో డైరెక్టర్ నాగులునాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీ రంగనాయక స్వామి దేవాలయంలో ఉత్తర ద్వార దర్శనం

**శ్రీరంగాపూర్, డిసెంబరు 29 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని ఎంతో ప్రసిద్ధిగాంచిన శ్రీశ్రీరంగనాయక స్వామి దేవాలయం నందు మంగళవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామి వారికి తెల్లవారుజామున సేవా కాలము తీర్థ గోష్టి తదనంతరం 5 గంటల ప్రాంతంలోస్వామివారి ఉత్తర ద్వార దర్శనం ప్రారంభమవుతుంది. ఈ పర్వదినమున జరిగే ఉత్తర ద్వారా దర్శనమును 10 రోజుల పాటుగా ఆరాధనోత్సవాలు జరగనున్నాయనిఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకుంటే మహావిష్ణువును దర్శించుకున్నంత పుణ్యం లభిస్తుందని భక్తులందరూ పాల్గొనాలని, భక్తులకు అనుకూలంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు కల్పించడం జరిగిందని ఆలయ అర్చకులు తెలియజేయడం జరిగింది.

## లక్ష్మాపూర్‌లో డ్రైనేజీ నిర్మాణంపై ప్రక్షాళన



గ్రామంలో నెలకొన్న సమస్యలపై పరిశీలిస్తున్న సర్పంచ్ బీసం గోపాల్

**ఉప్పునుంతల, డిసెంబరు29 ప్రభాతవార్త:** మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో సోమవారం గ్రామపంచాయతీ సర్పంచ్ బీసం గోపాల్ ఆధ్వర్యంలో గ్రామంలో సమస్యలపై ఆరా తీశారు. అధిక శాతం గ్రామంలో డ్రైనేజీ సక్రమంగా లేదని మురుగునీరు రోడ్లపై పారుతున్న విషయం వీధుల వారు గ్రామపంచాయతీ సర్పంచ్, పాలక మండలి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో అభివృద్ధి పట్ల పారదర్శకతతో ముందుకు వెళ్తామని సర్పంచ్ బీసం గోపాల్ పేర్కొన్నారు. గ్రామంలో పర్యటించిన వారిలో సర్పంచ్ బీసం గోపాల్, ఉపసర్పంచ్ శాంతమ్మ, వార్డు సభ్యులు ఖాజా, అన్వేష్, పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

## సీసీ రోడ్డు బిల్లులు మంజూరు

**ధన్వాడ, డిసెంబరు29 ప్రభాతవార్త:** ధన్వాడ మండలంయంనోనీపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సీసీ రోడ్డు బిల్లులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంజూరు చేయడంతో గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలోయంనోనీపల్లి గ్రామంలో గ్రామ పంచాయితీ కార్యాలయంలో సోమవారం చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోయ నాగేష్ చేతుల మీదుగాసీసీరోడ్ల లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఉప సర్పంచ్ కురువ సిద్ధప్ప పాల్గొని కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. చెక్కులు స్వీకరించిన లబ్ధిదారుల్లో చైర్మన్ బోయ నర్సింలు, కాశీనాథ్‌రెడ్డి, బోయ తిమ్మయ్య, బోయఅశోక్ తదితరులు ఉన్నారు. సర్పంచ్, ఉప సర్పంచ్ చేతుల మీదుగా చెక్కులు అందుకోవడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నవాబ్ మియా, బోయ పెద్ద నర్సింలు, వంక రాములు తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న దృశ్యం

## అర్హులైన అందరికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి




అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలంటూ వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**ఆత్మకూర్ డిసెంబర్ 29, ప్రభాతవార్త;** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ఐదవ వార్డులో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో సోమవారం రోజు ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ఐదవ వార్డులో నిరుపేదలైన దళితులు పెద్ద మొత్తంలో ఉన్నారని తద్వారా ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు కేటాయించి నిర్మింపజేయాలని ఆయన పేర్కొన్నారు. గత పది సంవత్సరాలుగా పట్టణంలోని దళితవాడకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మాణాలు చేపట్టాలంటే వింత పత్రాలు అందజేసినప్పటికీ అటు అధికారులుగానీ, ఇటు ప్రజాప్రతినిధులు గాని నిమ్మకు నీరెత్తినట్లుగా వివరించడం జరగడంతో అర్హులైన దళితులు తీవ్రంగా నష్టపోయారని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అర్హులైన ప్రతి ఒక్కరికిఇంటి నిర్మాణాలు చేపట్టాలని లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయంముందు నిరవధిక ఆందోళన కార్యక్రమాలకు పునుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐదో వార్డుకు చెందిన వివిధ రాజకీయ పక్షాలకు చెందిన కార్యకర్తలు, దళితులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామీణ పరిపాలన వ్యవస్థను అధ్యయనం చేయాలి

**డైరెక్టర్ విఐపి (విలేజెష్ ఇన్ పార్టనర్షిప్) డా. నాగేంద్ర స్వామి**




అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థినీ, విద్యార్థులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు29 ప్రభాతవార్త:** పాలమూరు విశ్వవిద్యాలయం డిపార్ట్మెంట్ ఆఫ్ సోషల్ వర్క్ మొదటి సంవత్సరము విద్యార్థిని విద్యార్థులు అసిస్టెంట్ ప్రొ॥ డా. ఎం.గాలెన్న ఆధ్వర్యంలో సోమవారం విలేజష్ ఇన్ పార్టనర్షిప్ సంస్థను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా విలేజష్ ఇన్ పార్టనర్షిప్ సంస్థ డైరెక్టర్ నాగేంద్ర స్వామి మాట్లాడుతూ సోషల్ వర్క్ డిపార్ట్మెంట్ విద్యార్థులు ప్రజాస్వామ్యంపై పూర్తిగా అవగాహన కలిగి ఉండి ఎన్నికల వ్యవస్థను అర్థం చేసుకోవడంలో ముందుండాలని అన్నారు. గ్రామ అభివృద్ధిలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల పాత్ర కీలకంగా ఉంటుందని సూచించారు. దేశానికి పల్లెలే పట్టుకొమ్మలుగా భావించే గ్రామపంచాయతీలలో పాలకమండలి పారదర్శక పరిపాలన అందించినప్పుడే గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుందని అన్నారు. సోషల్ వర్క్ స్టూడెంట్స్ గ్రామీణ పరిపాలన వ్యవస్థ పూర్తిగా అధ్యయనం చేయాలనీ తెలిపారు. డా. శ్రీధర్ విలేజ్స్ ఇన్ పార్టనర్షిప్ సంస్థ కొ ఆర్డినేటర్, ఎంఎస్‌డబ్ల్యు మొదటి సంవత్సరం విద్యార్థులు ఆంజనేయులు, పరుశరాముడు, శివ, రాకేష్, వసంత, రేవతి, కీర్తి, ప్రభావతి, మానస, అఫ్రిన్ బేగం, హర్షిత, స్వాతి, శివ, సుధాకర్, నార దత్తు, నవీన్ పాల్గొన్నారు.

## గొర్రెల కాపారులకు ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ



గొర్రెలు, మేకలకు నట్టల మందులు వేస్తున్న దృశ్యం

**మల్దకల్ డిసెంబర్ 29, ప్రభాతవార్త:** మల్దకల్ మండలం నందు పెద్దపల్లి గ్రామంలో గొర్రెలకు మరియు మేకలకు ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెద్దపల్లి గ్రామ సర్పంచ్ కే శిరీష రాజశేఖర్ రెడ్డి హాజరై, పశువైద్యాధికారిని డాక్టర్ ఉష తో కలిసి గొర్రెల కాపారులకు ఉచిత నట్టల నివారణ మందులు పంపిణీ చేయడం జరిగింది. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ అవకాశాన్ని గొర్రెలు మరియు మేకల పెంపకదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.. గ్రామంలో మొత్తం 400 గొర్రెలు మరియు 100 మేకలకు ఉచిత నట్టల నివారణ మందులు త్రాగించడం జరిగింది. ఈ కార్యక్రమం లో పశువైద్య సిబ్బంది మధు, గ్రామస్తులు రాజశేఖర్ రెడ్డి, శ్రీశైలం, పాల వెంకటేష్, చిన్న రంగన్న మరియు గొర్రెల కాపారులు పాల్గొన్నారు...

## గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎండి.అల్లిలుద్దీన్‌ను అభినందించిన మాజీ ఎమ్మెల్యే



**వెల్దండ, డిసెంబర్ 29 ప్రభాతవార్త:** చెర్కూర్ గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షునిగా ఇటీవల ఎన్నికైన ఎండి. అలీలుద్దీన్‌ను ఆదివారం మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటిసి విజితారెడ్డిలు అభినందించారు. పార్టీ అభివృద్ధికి, కృషి చేసి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలలోకి తీసుకెళ్లాలన్నారు. అలాగే జెడ్పీటిసి, ఎంపిటిసి ఎన్నికల కోసం ముమ్మరంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చెర్కూర్ గ్రామ సర్పంచ్ శ్రీనివాసు, మాజీ ఎంపిటిసి భీమయ్యగౌడ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మైసయ్య, ఉపసర్పంచ్ కొండల్, మాజీ ఉపసర్పంచ్ నరసింహ, వార్డ్ మెంబర్ లాలయ్య, రమేష్, కుమార స్వామి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు బాబా తదితరులు పాల్గొన్నారు.

## నర్సింగ్ కళాశాల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేయాలి

**– గద్వాల జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్**



నూతనంగా నిర్మించిన నర్సింగ్ కళాశాల భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

**గద్వాల, డిసెంబర్29, ప్రభాతవార్త:** గద్వాలలో నిర్మించిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవనాల ప్రారంభోత్సవం కు మిగిలి ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్ అన్నారు. సోమ వారం గద్వాలలోని దౌదర్పల్లి సమీపంలో నిర్మించిన నర్సింగ్ కళాశాల భవనాలను కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. నర్సింగ్ కళాశాల అకాడమిక్ బ్లాక్ బిల్డింగ్ వెనకాలే వసతి గృహ భవనాలు నిర్మించడంతో విద్యార్థినిలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. కళాశాల ముందు సిసి రహదారి నిర్మాణం, నీటి వసతి, విద్యుత్ సౌకర్యం తదితర మిగిలి ఉన్న పనులను వేగవంతం చేయాలన్నారు. జనవరిలో ప్రారంభోత్సవానికి త్వరలోనే తేదీ నిర్ణయించబడుతుందని, కాబట్టి పెండింగ్ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రారంభోత్సవ శిలాఫలకాల ఏర్పాటు, ప్రోటోకాల్ ప్రకారం అతిథులకు ఆహ్వానాలు, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. అంతకుముందు కేంద్ర ప్రభుత్వం 2026 27 విద్యా సంవత్సరంలో జిల్లాలో ఏర్పాటు చేయనున్న కేంద్రీయ విద్యాలయ భవన నిర్మాణానికి సమీపంలోని రెండు పడక గదుల ఇళ్ల వద్ద కలెక్టర్ స్థలపరిశీలన చేశారు. నిబంధనల ప్రకారం 5 ఎకరాల్లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయనుండడంతో రెవెన్యూ అధికారులు కలెక్టర్‌కు వివరాలు తెలియజేశారు. కేంద్రీయ విద్యాలయం భవన నిర్మాణం పూర్తయ్యే వరకు తరగతులను పాత ఎస్పీ భవనంలో లేదా గద్వాల కేజీబీవీలో నిర్వహించేందుకు పరిశీలన చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, గద్వాల తహసిల్దార్ మల్లికార్జున్, ఆర్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శప్రాయమైన మహానాయకుడు అటల్ బిహారీ వాజ్‌పేయి

**– మాజీ రాష్ట్ర మైనార్టీ మోర్చా అధ్యక్షుడు అప్సర్ పాషా**



సమావేశంలో మాట్లాడుతున్న అప్సర్ పాషా

**గద్వాల డిసెంబర్ 29, ప్రభాతవార్త:** భారత రత్న అటల్ బిహారీ వాజపేయి శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన జీవిత విశేషాల సమ్మేళనం కార్యక్రమం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. సోమవారం పట్టణంలోని డికె బంగ్లాలో ఈకార్యక్రమం నిర్వహించాగా ముఖ్య అతిథిగా మాజీ రాష్ట్ర మైనార్టీ మోర్చా అధ్యక్షుడు అప్సర్ పాషా పాల్గొని మాట్లాడారు. భారతదేశ రాజకీయాలకు అటల్ బిహారీ వాజ్‌పేయి ఒక ఆదర్శప్రాయమైన మహానాయకుడు అని, సిద్ధాంతాలు – సహనం – సమన్వయం అనే విలువలకు ప్రతిరూపంగా నిలిచిన నేత అని కొనియాడారు. దేశభక్తి, ప్రజాసేవ, విలువల రాజకీయాలకు ప్రతీకగా నిలిచిన వాజ్‌పేయి దేశ అభివృద్ధికి బలమైన పునాదులు వేసిన దూరదృష్టి కలిగిన నాయకుడు అని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా అందరి గౌరవాన్ని పొందిన ఆయన నాయకత్వం నేటి తరానికి స్ఫూర్తిదాయకమై నిలుస్తుందని, ఆయన చూపిన మార్గంలో నడవడమే నిజమైన నివాళి అని స్పష్టం చేశారు. దేశం కోసం అంకితభావంతో పనిచేసిన వాజ్‌పేయి ఆలోచనలు ఆ మహానేత సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లే బాధ్యత నుభారతీయ జనతా పార్టీ నిరంతరం కొనసాగిస్తుందని అన్నారు. ఆయన నాయకత్వంలో అమలైన స్వర్ణ చతుర్భుజ ప్రాజెక్ట్, జాతీయ రహదారి విస్తరణ, ప్రధాన మంత్రి గ్రామసడక్ యోజన, పనికి ఆహారం పథకం, టెలిఫోన్ విప్లవం వంటి కార్యక్రమాలు దేశ పురోగతికి శాశ్వత పునాదులు వేశాయని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు ఎస్. రామ చంద్ర రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్లు బండల వెంకట రాములు, అక్కల రమాదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శిలు కె కె.రెడ్డి, శ్యామ్ రావ్, శివా రెడ్డి, జిల్లా మహిళ మోర్చా అధ్యక్షురాలు సమత గౌడ్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దాస్, పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ, మండల అధ్యక్షులు, బిజెపి సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.

## ఎన్నికల హామీల అమలు దిశగా తొలి అడుగులు

**- కాంసానిపల్లి సర్పంచ్ చీమర్ల లలితమ్మ**



మీని ట్యాంకు మరమ్మత్తు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ చీమర్ల లలితమ్మ

**ఉప్పునుంతల, డిసెంబరు29 ప్రభాతవార్త:** ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన మాటకు కట్టుబడి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించే దిశగా వెంటనే చర్యలు చేపట్టారు. మండలంలోని కంసానిపల్లి గ్రామ సర్పంచ్ చీమర్ల లలితమ్మ గ్రామంలో నెలకొన్న సమస్యలపై పరిష్కార దిశలో పనిచేస్తున్నారు. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో కంసానిపల్లి సర్పంచ్‌గా విజయం సాధించిన చీమర్ల లలితమ్మ, తాను గెలిచిన వెంటనే గ్రామ సమస్యలను ప్రాధాన్యతగా తీసుకునిపరిష్కరిస్తానని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కార్యరూపంలో పెట్టడం ప్రారంభించారు. ఈ నెల 22న ప్రమాణ స్వీకారం పూర్తయిన వెంటనే గ్రామంలో పర్యటించిన సర్పంచ్ లలితమ్మ, ఆయా కాలనీలలో నెలకొన్న సమస్యలపై గ్రామస్తులతోప్రత్యక్షంగా ఆరాతీశారు. ముఖ్యంగా గ్రామంలో తీవ్రంగాఉన్న తాగునీటి సమస్యనుగుర్తించి, దాని పరిష్కారానికి ముందడుగు వేశారు. గ్రామంలోని వివిధ కాలనీలలో వృథాగా పడి ఉన్న బోరు బావులను గుర్తించి వాటికి మరమ్మత్తులు చేయించారు. పాతవి, పనిచేయని మోటార్ల స్థానంలో కొత్త మోటార్లు బిగించి నీటి సరఫరాను ప్రారంభించారు. అదేవిధంగా గ్రామంలోని మినీ వాటర్ ట్యాంకులను శుభ్రపరచి, పాడైపోయిన నల్లాల స్థానంలో కొత్త నల్లాలు ఏర్పాటు చేయించి సక్రమంగా తాగునీటి సరఫరా అందేలాచర్యలు చేపట్టారు. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తానని ఆమె పేర్కొనగా, ప్రజల సమస్యలకు స్పందించే నాయకత్వం తమకు లభించిందని గ్రామస్తులు హర్షిస్తున్నారు. గ్రామ సమస్యల పరిష్కారంలో చురుకైన చర్యలు తీసుకుంటున్న సర్పంచ్ చీమర్ల లలితమ్మను ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.

## ఉప్పునుంతల సర్పంచును సన్మానించిన బాల్య మిత్రులు



ఉప్పునుంతల సర్పంచు శ్రీనివాసులును సన్మానిస్తున్న బాల్యమిత్రులు

**ఉప్పునుంతల, డిసెంబరు29 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతల గ్రామ సర్పంచు చింతగాళ్ళ శ్రీనివాసులును బాల్య మిత్రులు ఘనంగా సన్మానించారు. 30 సంవత్సరాల క్రితం కలిసి విద్యాభ్యాసం చేసిన బాల్యమిత్రులు తోటి మిత్రుడు మండల కేంద్రమైన ఉప్పునుంతల గ్రామ సర్పంచ్ గా ఎన్నిక కావడంతో ఆయనతో కలిసి విద్యాభ్యాసం చేసిన బాల్య మిత్రులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బాల్య మిత్రుల ఆత్మీయ సమ్మేళనం భావోద్వేగాల మేళ విందుగా నిలిచింది. చిన్ననాటి నుంచి ఒకే బాటలో నడిచిన మిత్రుడు గ్రామానికి నాయకత్వం వహించే స్థాయికి చేరుకోవడం తమకు గర్వకారణం అనిబాల్యమిత్రులు పేర్కొన్నారు. సర్పంచు చింత గాళ్ళ శ్రీనివాసులును బాల్యమిత్రులు పూలమాలలు, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. చాలాకాలం తర్వాత మిత్రులంతా కలుసుకోవడం చిన్ననాటి జ్ఞాపకాలు నెమలి వేసుకుంటూ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. సుదూర ప్రాంతాల్లో స్థిరపడిన బాల్యమిత్రులు సుమారు 30సంవత్సరాల తర్వాత కలుసుకోవడం ఈ సమావేశానికి మరింత ప్రత్యేకతను తెచ్చింది. కాలం గడిచిన కారణంగా ఒకరినొకరు గుర్తు పట్టుకునేందుకు క్షణం ఆలస్యమైన, మిత్రత్వం మాత్రం క్షణాల్లోనే మళ్లీ పునర్జీవించింది. ప్రజలకు అందు బాటులో ఉంటూ, అభివృద్ధి దిశగా గ్రామాన్ని నడిపించాలని కోరారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన ఉప్పునుంతల గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు మాట్లాడుతూ బాల్యమితుల ఆశీస్సులు తన గెలుపుకు ఎంతో ప్రోత్సహం అందించారని, బాధ్యతలు మరింత అప్పగించారని చెప్పారు. తాను గ్రామాభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని, చిన్ననాటి స్నేహితులు నాయకత్వ విజయంతో మేళవించిన ఈ ఆత్మీయ సమ్మేళనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో బాల్యమిత్రులు కట్ట జనార్దన్ రెడ్డి, ఎండి బురాన్, కట్ట శ్రీనివాస్ రెడ్డి ( రంగారెడ్డి) ,పి. సుదర్శన్, ఎండి అశ్వక్, పాపిరెడ్డి శ్రీనివాసులు, బి.తిరుపతయ్య, ఎండి అన్వర్, దుద్దు బొందయ్య, బాతుకుల బుగ్గయ్య, పెద్దిరెడ్డి కృష్ణారెడ్డి, వెంకటేష్, బృంగి విమల, మంజుల, సువర్ణ, బాలీశ్వరమ్మ, పుష్ప, ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోలు గోల్‌మాల్

(మొదటి పేజీ తరువాయి)

ఇతని ఖాతాలో 5.65.715 రూపాయలు, కావలి నాగేంద్రం బ్యాంకు ఖాతాలో 2.29.344 రూపాయలు,మండ్ల సరస్వతి బ్యాంకు ఖాతాలో 1,24, 288 రూపాయలు చలమారెడ్డి రంగవరం గ్రామానికి చెందిన రైతు ఇతని పేరు మీద ఐదు లక్షల 25 వేల 586 రూపాయలు దేవయ్య 31. 534 రూపాయలు పేర్ల మీద బ్యాంకు ఖాతాలో జమ అయినట్లు సమాచారం అయితే విషయం ఏమంటే చల్మారెడ్డి అనే రైతుగోపాల్దిన్నె గ్రామానికి చెందిన వాడు కాదు ఇతను వడ్లు గోపాల్దిన్నె వరి కొనుగోలు కేంద్రాల్లో పోయలేదు వాస్తవంగా ఇతనికి పండిన పంట రంగవరంలో ఇప్పటివరకు వడ్లను తూకం చేయలేదు అని బుక్ కీపర్ తెలిపారు. వీరిలో ఒకరి దేవయ్య పేర్లమీద పడ్డ డబ్బులను డాటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్ ఖాతాలోకి ఫోన్ పే ద్వారా మొత్తం బోనస్ డబ్బులతో సహా మళ్ళించుకున్నట్లు సమాచారం దీని మీద బుక్ కీపర్ పై అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు వెంటనే స్పందించి ఆదివారం నాడు ఆగ్రామంలో ఏపిఎంఆధ్వర్యంలో విచారణ చేపట్టి ఆ విషయాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్, కలెక్టర్‌కు తెలియజేసినట్లు సమాచారం దీనిపై సోమవారం నాడువారు విచారణ చేపట్టారు. ఈ విషయాన్ని అడిషనల్ వనపర్తి జిల్లా కలెక్టర్‌డి ఓ సోమవారం సాయంత్రం విచారిస్తున్నట్లుగా తెలిసింది. అయితే ప్రధానంగా ఈ వ్యవహారంపై వాస్తవంగా 5 మంది రైతులతో వడ్లు కొనుగోలు గోపాల్దిన్నె మార్కెట్ ద్వారా చేశాంన్నది విచారించాలి అదేవిధంగా ఆ రైతులకు ఎంత భూమి ఉన్నది. దానికి సంబంధించి ఎన్ని ఓట్లు తూకం చేశారన్నది కూడా తేలవలసి ఉంది. వీటిలో సన్నవడ్ల లావు వడ్ల అన్నది కూడా తెలియాలి ఒట్టిగా అతనిపై ఎలాంటి విచారణ చేయకుండా అంతా సరిగ్గానే ఉందని అధికారులు దులుపుకుంటే ఆ విచారణ ఫెయిల్ అయినట్లే ఎవరైతే ఫ్రాడ్ కు పాలు పడ్డారో ఆ వ్యక్తితో ఆ ఆ డబ్బు రికవరీ చేయించడంతోపాటు అతనిపై కేసు పెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. మళ్లీ ఇలాంటి పనులు ఎవరు కూడా చేయకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## నా లాగిన్ నా నియమం" తో సైబర్ మోసాలకు ఫుల్‌స్టాప్

(మొదటి పేజీ తరువాయి)

రూపొందించిన సైబర్ అవగాహన పోస్టర్లను ఉపయోగించి,ఓటీపీ మోసాలు నకిలీ కస్టమర్ కేర్ కాల్స్, సోషల్ మీడియా నకిలీ ఖాతాలు,కేవైసీ అప్‌డేట్ మోసాలు, వంటి అంశాలపై సిబ్బందికి వివరంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పై మాట్లాడుతూ సైబర్ నేరాలు రోజురోజుకు కొత్త రూపాల్లో ప్రజలను మోసం చేస్తున్నాయి. ముందుగా పోలీసులే పూర్తి అవగాహన కలిగి ఉండాలి.ప్రతి లాగిన్ వ్యక్తిగత భద్రతతో ముడిపడి ఉంది. మీ ఓటీపీ, పాస్‌వర్డ్ ఎవరికీ చెప్పకపోవడమే సైబర్ భద్రతకు మొదటి అడుగు."అనుమానాస్పద కాల్స్, లింక్‌లకు దూరంగా ఉండాలి, బ్యాంక్, కస్టమర్ కేర్ పేరుతో వచ్చే కాల్స్‌పై నమ్మకం పెట్టవద్దు, సైబర్ మోసాలకు గురైతే వెంటనే1930 నంబర్‌కుకాల్ చేయాలి,లేదా సైబర్‌క్రైమ్.జిఓవి.ఇన్‌లో ఫిర్యాదు చేయాలని సైబర్ భద్రతపై అవగాహనతోనే మోసాలకు అడ్డుకట్ట వేయాలని ఎస్పై అన్నారు.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా అన్ని పోలీస్టేషన్ల పోలీసు సిబ్బంది జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బంది, సైబర్ పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## గాయపడిన ఉపాధ్యాయులను ప్రభుత్వం ఆదుకోవాలి

■ మాజీ మంత్రి డా. లక్ష్మారెడ్డి


ఉపాధ్యాయుడిని పరామర్శిస్తున్న లక్ష్మారెడ్డి

**జడ్చర్ల, డిసెంబరు29 ప్రభాతవార్త:** మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ జిల్లా రూరల్ మండలంలో మాచన్‌పల్లిలో ఎన్నికల విధులు నిర్వహిస్తూ ఈ నెల 11న ఎన్నికల రోజున వేకువజామునే సరియైన లైటింగ్ సౌకర్యము కల్పించక విపరీతంగా పాకర పేరుకుపోయిన వాటర్ ట్యాంక్ ప్రదేశంలో జారిపడిపోయి జడ్చర్లకు చెందిన ఉపాధ్యాయుడు శివకుమార్ కుడి భుజమునకు శస్త్ర చికిత్స నిర్వహించారు.ఈ మేరకు మాజీ మంత్రి డా. లక్ష్మారెడ్డి ఆయన్ని పరామర్శించారు. ఎన్నికల్లో విధుల్లో గాయపడిన సిబ్బందికి ఎవరికైనా నష్టపరిహారం ప్రభుత్వపరంగా తప్పక చెల్లించాలని ఇది ప్రభుత్వ బాధ్యత అని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుడు గాయపడి దాదాపు 15 రోజులు అయినప్పటికీ ఈ రోజు వరకు కూడా జిల్లా ఎన్నికల అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదని నష్టపరిహారం చెల్లించే విధంగా ఆలోచించాలని కోరారు.కార్యక్రమంలో ప్రభుత్వపరంగా రావాల్సిన కాంపెన్సేషన్ వెంటనే మంజూరు చేయాలని కోరారు. మాచన్‌పల్లి గ్రామంలో సరియైన ఏర్పాట్లు శుభ్రత పాటించకనే ఇలా జరిగిందని మహబూబ్‌నగర్ రూరల్ మండలం ఎన్నికల అధికారులు బాధ్యత వహించి న్యాయం చేయాలని మాజీ మంత్రి జడ్చర్ల మాజీ శాసనసభ్యులు లక్ష్మారెడ్డి కోరారు. వారి వెంట యాదయ్య, కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి, నందకిషోర్ గౌడ్, మురళి తదితరులు పాల్గొన్నారు.ఈ విషయము జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తామని తగు న్యాయం జరిగేటట్లు సహకారం అందిస్తామని తెలిపారు.

## యూరియా కొరత లేదు

**యూరియా యాప్ ద్వారా బుక్ చేసుకోవాలి**

**మహబూబ్‌నగర్ జిల్లా వ్యవసాయ అధికారి బి.వెంకటేష్ వెల్లడి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు29 ప్రభాతవార్త :** జిల్లాలో యూరియా కొరతలేదని జిల్లా వ్యవసాయ అధికారి బి వెంకటేష్ తెలిపారు మహబూబ్ నగర్ జిల్లాలో రైతులకు అవసరమైన యూరియా ఎరువులు సరిపడా నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. మహబూబ్ నగర్ జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్ గా యూరియా అప్ ద్వారా ఆన్లైన్ లో రైతులు బుక్ చేసుకోవడం అమలు జరుగుతుందని తెలిపారు.ప్రతి రైతు ఆన్లైన్‌లో బుక్ చేసుకుని యూరియా కొనుకోవచ్చని,ప్రతి షాప్‌లో యూరియా అందుబాటులో ఉందని తెలిపారు.జిల్లాలో ఇంత వరకు 11029 మంది రైతులు ఆన్లైన్ లో ఆప్ ద్వారా 32669 ఎరువుల బస్తాలు బుక్ చేసుకోగా 24918 ఎరువుల బస్తాలు రైతులు తీసుకు వెళ్లడం జరిగిందని, మిగిలిన బస్తాలు కూడా నిర్దేశిత సమయంలోగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. యూరియా పంపిణీపై సంబంధిత అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారని తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించడం,అధిక ధరలకు విక్రయించడం వంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలుతీసుకుంటామని హెచ్చరించారు. రైతులు ఎవరైనా యూరియా సరఫరాలో సమస్యలు ఎదుర్కొంటే సమీప వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు.అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయకుండా, శాస్త్రీయ పద్ధతిలో వినియోగించాలని రైతులను కోరారు.

## తొలి సమావేశం నిర్వహించిన తాటిపర్తి సర్పంచ్

**భూత్పూర్,డిసెంబర్ 29,ప్రభాతవార్త :** సర్పంచిగా గెలిచిన తర్వాత తన సహచరులైన వార్డు సభ్యులతో కలిసి సర్పంచి సోమవారం తొలి సమావేశం నిర్వహించారు.భూత్పూర్ మండలం తాటిపర్తి గ్రామ పంచాయతీకి సంబంధించి పదివార్డుల సభ్యులతో కలిసి సర్పంచి హబీబాఫసియోద్దిన్ సమావేశం నిర్వహించి తన తొలిసమావేశంలో గ్రామంలోని వివిధ వార్డు సభ్యుల పరిచయాలతో పాటుగా వార్డు సమస్యల్ని సర్పంచి హబీబాఫసియోద్దిన్ అడిగి తెల్సుకున్నారు.వార్డు సభ్యులతో కలిసి స్వయంగా డ్రైనేజీ సమస్య ఉన్న వార్డులో పర్యటించి సమస్య పరిష్కారం దిశగా చర్యలు చేపట్టారు.ఈ కార్యక్రమంలోఉపసర్పంచి మద్ద రాఘవేందర్ ఇతర వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## నూతన సాంకేతిక వ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలి

**బాధితులకు పోలీసులు న్యాయం చేస్తారనే నమ్మకం, భరోసా కల్పించాలి : వనపర్తి డిఎస్పీ వెంకటేశ్వరరావు**


పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డిఎస్పి వెంకటేశ్వరరావు

**వనపర్తి, డిసెంబరు29 ప్రభాతవార్త:** పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల బాధితులకు పోలీసు అండగా ఉన్నారనే నమ్మకం, భరోసా కల్పిస్తూ వారి పట్ల అధికారులు, సిబ్బంది మార్యాదపూర్వకంగా వ్యవహరించాలని వనపర్తి డిఎస్పీ వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం వనపర్తి జిల్లా పరిధిలోని వనపర్తి పట్టణ పోలీస్‌స్టేషన్ " వార్షిక తని ఖీలలో " భాగంగా వనపర్తి డిఎస్పీ సందర్శించి తనిఖీ చేశారు. ముందుగా పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న డిఎస్పీ వనపర్తి సీఐ, కృష్ణయ్య పూల మొక్క లందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ స్టేషన్లో రికార్డ్స్ ను, పరిసరాలను తనిఖీ చేసి పోలీస్‌స్టేషన్ రిసెప్షన్,లాకప్,మెన్ బ్యారెక్, టెక్నికల్ రూం, పరిసరాలను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎక్కువగా ఎలాంటి నేరాలు జరుగుతున్నాయి, పెండింగ్‌లో ఉన్న కేసులు, దర్యాప్తు వివరాలను వనపర్తి రూరల్ ఎస్సై, జలందర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వార్డుకు పోలీసు అధికారిని కేటాయించి విపిఓ విధానాన్ని పక్కాగా అమలు చేస్తూ. గ్రామాలకు సంబంధించిన విపిఓలు రోజు గ్రామాలను సందర్శించి అక్కడ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని గ్రామాలలో ప్రజలతో స్నేహపూర్వకమైన సంబంధాలు కొనసాగించాలి. ముఖ్యంగా ఓపెన్ డ్రింకింగ్ జరగకుండా గస్తీ నిర్వహించాలన్నారు. పోలీస్‌స్టేషన్లో ఉన్న బ్లూ కోర్ట్, స్టేషన్ రైటర్స్, సెక్షన్ ఇంచార్జ్, పెట్రోకార్,రిసెప్షన్ లాంటి వర్టికల్స్ ఖచ్చితంగా అమలు చేయాలని సూచించారు. వనపర్తి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి, మట్కా, పేకాట లాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పర్యవేక్షించాలి అన్నారు. రాత్రి సమయాలలో మరింత పటిష్టంగా గస్తీ పెట్రోలింగ్ నిర్వహిస్తూ నేరాల అదుపునకు కృషి చేయాలన్నారు. సాయంత్రం సమయాలలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి సీఐ కృష్ణయ్య, వనపర్తి రూరల్ ఎస్సై జెలెందర్ రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలపై ప్రత్యేక తనిఖీలు

**నార్కోటిక్ డాగ్ రుద్రతో ప్రత్యేక చెకింగ్**

**మహబూబ్‌నగర్ వన్ టౌన్ పరిధిలో విస్తృత తనిఖీలు**

**మహబూబ్‌నగర్ క్రైమ్, డిసెంబరు 29 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి ఆదేశాల మేరకు, వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య, సిబ్బందిసోమవారం, డిసెంబర్ 31 సందర్భంగా మత్తు పదార్థాల నియంత్రణలో భాగంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాన్ షాపులు, ఇతర ముఖ్యమైన కూడళ్లలో ఉన్న షాపులు, ప్రజలు అధికంగా రాకపోకలుసాగించే ప్రాంతాల్లో మత్తు పదార్థాల నిల్వలు, అక్రమ విక్రయాలపై క్షుణ్ణంగా పరిశీలించారు.తనిఖీల సమయంలో నార్కోటిక్ డాగ్ రుద్ర సహాయంతో షాపులు, పరిసర ప్రాంతాలను పూర్తిస్థాయిలో చెక్ చేయడం జరిగింది. నూతన సంవత్సర వేడుకల సమయంలో మత్తుపదార్థాల వినియోగం పెరగకుండా ముందస్తు చర్యలుగా ఈ


నార్కోటిక్ డాగ్ రుద్ర సహాయంతో తనిఖీలు చేస్తున్న పోలీస్ సిబ్బంది

తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.ఇన్స్పెక్టర్ అప్పయ్య మాట్లాడుతూ మత్తు పదార్థాల విక్రయాలు,నిల్వలు, వినియోగానికి పాల్పడితే కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి శాంతియుతంగా నూతనసంవత్సర వేడుకలను జరుపుకోవాలని, అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీసేందుకే సైన్స్ ప్రదర్శనలు

**చింతకుంట, డిసెంబరు29 ప్రభాతవార్త:** విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని మండల విద్యాధికారి మురళీకృష్ణ తెలిపారు. సోమవారం మండలంలోని లాల్‌కోట జడ్పి ఉన్నత పాఠశాలలో మూడు జడ్పీ ఉన్నత పాఠశాలలు, ఆరు ప్రాథమికోన్నత పాఠశాలలు, 14 ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల ఆధ్వర్యంలో వృధా పదార్థాలతో సైన్స్ ప్రయోగాల కార్యక్రమంలో భాగంగా ఆయా పాఠశాలల విద్యార్థులు వేస్ట్ పదార్థాలైన ప్లాస్టిక్, కార్డు బోర్డు, పాత ఇనుము భాగాలు, నిరుపయోగమైన విద్యుత్ సామాగ్రి వంటి వస్తువులతో విద్యార్థులు తమ ఆలోచనకు పదును పెట్టి చక్కటి ప్రయోగాలతో ఎంతగానో


విద్యార్థుల ప్రదర్శన తిలకిస్తున్న ఎంఈఓ, పరిశీలకులు

ఆకట్టుకున్నారు. విద్య అనేది కేవలం పరీక్షలకే పరిమితం కాకుండా జీవితానికి ఉపయోగపడే జ్ఞానంగా మారాలన్న సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా బలంగా వినిపించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి, లాల్‌కోట జిహెచ్ఎం మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రదర్శన ద్వారా విద్యార్థుల్లోని దాగి ఉన్న సృజనాత్మకతను, శాస్త్రీయ దృక్పథాన్ని, నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే ఈ ప్రదర్శనలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఒక సమస్యకు పరిష్కారాన్ని స్వయంగా కనుగొని వారి ఆలోచనతో రూపొం దించిన ప్రయోగాల ద్వారా విద్యార్థులు పుస్తక పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా చేసి నేర్చుకుని విధానానికి ఉదాహరణగా నిలిచారన్నారు. తరగతి గదిలో నేర్చుకున్న శాస్త్రీయ సూత్రాలు, గణిత భావనలు, పర్యావరణ అంశాలు, వాస్తవ జీవితంలో ఎలా ఉపయోగపడతాయో ఈ ప్రదర్శనలు ప్రత్యక్షంగా విద్యార్థులకు అర్థమయ్యేలా చేసిందన్నారు. ఈ కార్యక్రమానికి జడ్జిలుగా జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు, నేషనల్ గ్రీన్ కార్స్ నుంచి రాజశేఖర్ హాజరై విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలను పరిశీలించి విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. ఈ సైన్స్ ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన పాఠశాలలకు బహుమతులను అందజేశారు. లాల్ కోట ఉన్నత పాఠశాలకు (ప్రథమ బహుమతి) ప్రాథమికోన్నత పాఠశాల అమ్మాపూర్ కు (ద్వితీయ బహుమతి) ప్రాథమికోన్నత పాఠశాల పర్దీపూర్ (తృతీయ బహుమతి) సాధించారని పరిశీలకులు తెలిపారు. ప్రాథమిక పాఠశాల విభాగంలో ప్రాథమిక పాఠశాల పల్లమర్రి (ప్రథమ బహుమతి) ప్రాథమిక పాఠశాల నెల్లికొండి (ద్వితీయ బహుమతి), ప్రాథమిక పాఠశాల పెద్ద వడ్డేమాన్ (తృతీయ బహుమతి) పొందారని తెలిపారు. గెలుపొందిన పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేసి అభినందించారు. గైడ్ టీచర్లకు శాలువా, మెమెంటోలతో సత్కరించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం గంగయ్య, కుమారస్వామి, రాజశేఖర్, ఉదయభాస్కర్, పర్వీన్, వెంకట్ రాములు, నేపాల్, సమత, రవికుమార్, రాధమ్మ, జయలక్ష్మి ౯, సాయి చరణ్, వినోద్ కుమార్, సీఆర్పీలు విజయ్ సింహ, ప్రవీణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## దరఖాస్తులు షురూ..

**జిల్లా కాంగ్రెస్ కమిటీ పదవులకు దరఖాస్తులు స్వీకరించిన డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్**


దరఖఖాస్తులు స్వీకరిస్తున్న డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్

**మహబూబ్‌నగర్ బ్యూరో,డిసెంబర్29, ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ పదవులకు దరఖాస్తులు పోటెత్తాయి. ఈనెల 26న జిల్లా పరిశీలకుడు గంజి భాస్కర్ సమావేశం నిర్వహించి జిల్లా కమిటీ పదవులకు సంబంధించి విధి విధానాలు తెలియజేశారు. మంగళవారం చివరి తేదీ కావడంతో చాలా మంది ఆయా పదవులకు దరఖాస్తులు చేసుకున్నారు. డీసీసీఅధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ పార్టీ కార్యాలయంలో పలువురి నుంచి దరఖాస్తులను స్వీకరించారు. జిల్లాలోని ప్రతి బ్లాక్ కు ఒక జిల్లా ఉపాధ్యక్ష పదవి, బ్లాక్ కు రెండు ప్రధాన కార్యదర్శులు, ప్రతి మండలానికి ఒక కార్యదర్శి, జిల్లా కోశాధికారి, ప్రతి అసెంబ్లీ నియోజక వర్గం నుంచి ఒక అధికార ప్రతినిధి, అదే విధంగా మున్సిపల్ కార్పొరేషన్ లేదా మున్సిపాలిటీ పరిధిలో ప్రతి 10 డివిజన్లకు ఒక ప్రధాన కార్యదర్శి,ఐదు డివిజన్లకు ఒకకార్యదర్శి పదవులతోపాటు జిల్లా కార్యవర్గంలో గరిష్టంగా 15 మందిని కార్యవర్గ సభ్యులుగా నియమించనున్నారు.జిల్లా కమిటీ పదవులకు వచ్చిన దరఖాస్తులను జిల్లా పరిశీలకుడు టీపీసీసీకి అందజేయనున్నారు. ఈనెల 31లోపు లేదా జనవరి మొదటి వారంలోజిల్లాకమిటీ కార్యవర్గంప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## అరటి ఆకులో భోజనం శ్రేష్టమని సంస్కృతి సాంప్రదాయానికి నిదర్శనం

**నారాయణ పేట, డిసెంబరు 29 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో అయ్యప్ప స్వాముల పూజా కార్యక్రమంలో గురుస్వాములు మాట్లాడుతూ అరటి ఆకులో భోజనం చేయడం అన్నిటికీ శ్రేష్టమని, ఇది భారతీయ సంస్కృతి-సాంప్రదాయాలకు నిదర్శనమని సీనియర్ గురుస్వాములు మనోహర్ ప్రసాద్ గౌడ్, గందె చంద్రకాంత్ అప్పి అన్నారు. పట్టణానికి సమీపంలోని పుట్‌పాక్ గ్రామంలో మాజీ సర్పంచ్ తిరుమలేష్ గౌడ్ స్వగృహంలో అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి మహాభిషేకం, పుష్పాలంకరణ, పేట తుళ్లి ఆటలతో పాటు మహానైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహిపాల్ రెడ్డి, గాయకుడు మల్‌రెడ్డి బృందం ఆలపించిన భక్తి గీతాలు భక్తులను విశేషంగా ఆకట్టుకు న్నాయి. అనంతరం 100 మంది అయ్యప్ప స్వాములతో పాటు భక్తులు, మహిళలకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు ఉమాపతి, కిషోర్ గౌడ్, బాల్‌రాజ్, వెంకటప్ప మేస్త్రీ తమ్మాళి రాము, అరకంచి సూరిబాబు పాల్గొన్నారు.

## రూరల్ ఎస్ఐపై డీజీపీకి ఫిర్యాదు

**నారాయణ పేట, డిసెంబరు 29 ప్రభాతవార్త:** నారాయణపేట రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ రాముడు పై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డికి విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో డీజీపీని కలిసిన ఆయన, ఈ మేరకు లిఖిత పూర్వకఫిర్యాదు సమర్పించారు.ఇటీవల నిర్వహించిన సర్పంచ్ ఎన్నికల్లో ఎన్నికలనిబంధనలు ఉల్లంఘిస్తూ పేటరూరల్ఎస్ఐ అత్యుత్సాహంగా వ్యవహరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒక పార్టీకి అనుకూలంగాపనిచేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు.ఈవిషయంలో తగిన ఆధారాలను కూడా డీజీపీకి అందజేశామని బాలస్వామితెలిపారు. ఎవరిస్థాయి ఏమిటన్న విచక్షణ లేకుండా వ్యవహరించిన ఎస్ఐపైచట్టపరమైన చర్యలు తీసుకోవాలనిఆయన డిమాండ్ చేశారు. ఇదే అంశంపై ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఈ వ్యవహార శైలిపై కేంద్రదర్యాప్తు సంస్థలుకూడా పరిశీలన చేస్తున్నాయని తెలిపారు. ఫిర్యాదుస్వీకరించిన డీజీపీ స్పందిస్తూ, ఈ ఘటనపై వెంటనే విచారణ చేపడతామని హామీ ఇచ్చినట్లు పగుడాకుల బాలస్వామి తెలియజేశారు.

## ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

**ఆర్డీఓ నవీన్, జడ్‌పి సిఈఓ వెంకటరెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 29 ప్రభాతవార్త:** మండలంలోని వివిధ గ్రామాల నుంచి కలెక్టరేటుకు వచ్చిన ప్రజా ఫిర్యాదులను సంబంధిత అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆర్‌డిఓ నవీన్, జడ్‌పిసి ఈఓ వెంకట రెడ్డి లు అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులను.సమావేశ పరచి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌డిఓ నవీన్, జడ్‌పిసి ఈ. ఓ వెంకట రెడ్డి లు ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణి లో స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ పరిష్కారం చేయాలని సూచించారు. సమావేశంలో డిఆర్‌డిఓ నర్సింహులు,గృహ నిర్మాణ శాఖ ఇంచార్జి పి.డి వేణు గోపాల్ పాల్గొన్నారు.

## యూరియా అధిక వినియోగంపై వ్యవసాయాధికారి హెచ్చరిక

**మద్దూరు, డిసెంబరు 29 ప్రభాతవార్త :** మద్దూరు మండల వివిధ గ్రామాలలో రైతులు పంటల సాగులో యూరియాను అవసరానికి మించి ఉపయోగించడం వల్ల నేలసారము తగ్గిపోవడంతో పాటు దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని మద్దూరు మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు.అధిక మోతాదులో యూరియా వాడలం వల్ల నేలలో పోషకాల అసమతుల్యత ఏర్పడి, ప్రయోజన కరమైన సూక్ష్మజీవులునశించే అవకాశం ఉందన్నారు. దీని ప్రభావంగా భూగర్భ జలాలు కలుషితంకావచ్చని తెలిపారు.పంటల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మట్టిపరీక్ష నివేదికలఆధారంగానే ఎరువుల వినియోగం జరగాలని సూచించారు.నత్రజని, భాస్వరం,పొటాష్ (ఎన్‌పికె) సమతుల్యంగా ఉండే విధంగా వ్యవసాయ శాఖ సూచించిన మోతాదులను తప్పనిసరిగాపాటించాలన్నారు.అలాగే సేంద్రీయ ఎరువుల వినియోగం ద్వారా భూమి సహజ సారాన్ని కాపాడుకో వడంతో పాటు దీర్ఘకాలంలో మెరుగైన దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. యూరియాను విచక్షణతో వినియోగించి సమతుల్య ఎరువుల పద్ధతిని అనుసరిస్తే సాగు వ్యయం తగ్గి మంచి లాభాలు పొందవచ్చని పేర్కొన్నారు.

## కన్నకొడుకు నమ్మించి మోసం చేశాడని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన తల్లి


అదనపు కలెక్టర్ నర్సింగరావుకు ఫిర్యాదు అందజేస్తున్న నర్సమ్మ

**గద్వాల, డిసెంబర్ 29, ప్రభాతవార్త:** కన్నకొడుకు తల్లిని నమ్మించి మోసం చేశాడని ఓ తల్లి ప్రజావాణిలో కలెక్టర్‌కు పిర్యాదు చేసింది. సోమవారం పిర్యాదులదినోత్సవ సందర్భంగా పట్టణంలోని సుంకలమ్మ మెట్టు వీదిలో నివాసం ఉంటున్న బోయ నరమ్మ భర్త చంద్రన్న అనే మహిళ ప్రజావాణిలో ఆమె గోడు వినిపించి తల్లడిల్లింది.ఆమె భర్త చంద్రన్న మరణించక ముందు అనారోగ్యంతో వున్న నా భర్తను, నన్ను జీవితాంతం వారి బాగోగులు చూసుకుంటానని నమ్మించి ఆమె భర్త పేరుపై వున్న స్వంత ఇంటిని తన కుమారుడు గిఫ్ట్‌డీడ్ చేయించుకున్నాడని, తీర ఆమె భర్త మరణించాక తల్లీ అని చూడకుండా ఆమెను ఇంటి నుండి తరిమేసి బజారు పాలు చేశాడని రోదించింది. పక్షవాతంతో కాళ్ళు నడవలేక, మందులకు డబ్బులు లేక, చూసుకునే దిక్కులేక బ్రతుకు భారం అయిందని ఆవేదన వెల్లబుచ్చింది.నా సమస్యపై స్పందించి నాకు న్యాయం చేయాలని ఆమె అధికారులను కోరారు.

## అక్రమ హౌస్ అరెస్టుతో కేసిఆర్ ప్రభంజనాన్ని ఆపలేరు


హనుమంతు నాయుడుని హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

**గద్వాల డిసెంబర్ 29, ప్రభాతవార్త:** అక్రమ అరెస్టులతో కేసీఆర్ ప్రభంజనాన్ని ఆపలేరని బిఆర్‌యస్ పార్టీ గద్వాల నియోజక వర్గ ఇంచార్జ్ బాసు హనుమంతు నాయుడు అన్నారు. సోమవారం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నైపద్యంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళుతున్నాడని సమాచారం అందుకున్న పోలీసులు బాసు హనుమంతు నాయుడునీ వారి స్వగృహంలో హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ అరెస్టు పై బాసు హనుమంతు నాయుడు మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాలకు మా నాయకుడు కేసీఆర్ హాజర వుతారని, అసెంబ్లీ సమావేశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతినీ, అక్రమా లను ఎండగడుతారని అన్నారు. తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ అవినీతి, అబద్ధాల హామీలపాలన అర్థమవుతుందని, త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వా నికి తగిన గుణ పాఠం చెపుతారని అన్నారు. ఇప్పటికీ ఇప్పుడు ఎన్నికలు వస్తె కేసీఆర్ గెలుపు ఖాయమని అన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణరాష్ట్రంలోనీ అన్నీ రంగాలు, వ్యవస్థలు, బడుగు బలహీన వర్గాలు ఎంతో అభివృద్ధి చెందాయని, ప్రజలుమళ్ళీ కేసీఆర్ పాలన రావాలని కోరుతు న్నారని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

## జర్నలిస్టులకు డైరీలు అందజేత

**మల్దకల్ డిసెంబర్ 29, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో సోమవారంమండల ఆర్యవైశ్య సంఘ వ్యవస్థాపకులు మనసాని నాగరాజు ఆధ్వర్యంలో 2026 సంవత్సరానికి సంబంధించిన నూతన డైరీలను మల్దకల్ మండల జర్నలిస్టు సోదరులకు సోమవారం అందజేశారు. స్థానిక శ్రీకన్యకా పరమేశ్వరి దేవాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు బాదాం శ్రీనివాసులు,వెంకటేశ్వర్లు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఛత్రపతి శివాజీ విగ్రహా నిర్మాణానికి భూమి పూజ


అప్పాయిపల్లిలో ఛత్రపతి శివాజీ విగ్రహానికి భూమి పూజ చేస్తున్న సర్పంచ్ విజయకృష్ణ

**లింగాల, డిసెంబరు 29 ప్రభాతవార్త:** మండలంలోని అప్పాయిపల్లి గ్రామంలో ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ విగ్రహ నిర్మాణానికి సర్పంచ్ విజయకృష్ణ సోమవారం భూమి పూజ చేశారు. ఛత్రపతి శివాజీ విగ్రహదాత రామావత్ లక్ష్మణ్ విగ్రహాన్ని ఇప్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే అంబేద్కర్ విగ్రహ దాత కిరణ్ కుమార్, మహాత్మా గాంధీ విగ్రహాన్ని దాత గార్లపాటి కాశీనాథం ఇవ్వనున్నట్లు, ఈ మూడింటిని విగ్రహాలను ఒకే దిమ్మెపై పెట్టుటకు గ్రామ సర్పంచ్ వీలైనంత త్వరగా దిమ్మెను ఏర్పాటు చేసి విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మొగిలి నిరంజన్, సీనియర్ నాయకులు కాశీనాథం, శ్రీహరి, చంద్రియ్య, పర్వతాలు, మహేష్, బళ్లారి రాము, పుట్ట మల్లయ్య, పుట్ట హుస్సేన్,వార్డు సభ్యులుఇంద్రమ్మ, భోజయ్య, పద్మ, నరేష్, సలేశ్వరం, సునీత, శ్రీను, ఛత్రపతి శివాజీ, యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అభిలాష్‌కు అభినందనలు

**జడ్చర్ల, డిసెంబరు 29 ప్రభాతవార్త:** స్థానిక డా. బూర్గుల రామకృష్ణ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఎ), జడ్చర్ల లో తృతీయ సంవత్సరం బిజడ్‌సి చదువుతున్న బెస్త అభిలాష్ ను కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి. సుకన్య సన్మానించారు. ఈ నెల 22 నుండి 28 వరకు హైదరాబాద్ లోని మర్రి లక్ష్మణ్ రెడ్డి విద్యా సంస్థలలో జరిగిన జాతీయ సమైక్యతా శిబిరానికి పాలమూరు విశ్వవిద్యాలయం నుండి ప్రాతిపదిక వహించాడు. అభిలాష్ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ 3లో వాలంటీర్‌గా కొనసాగుతున్నాడు అని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ వారం రోజుల్లో భారతదేశం నలుమూలల నుండి వచ్చిన వాలంటీర్ లతో కలసి అనేక పర్యావరణ హిత కార్యక్రమాలలో పాల్గొన్నాడని, సాంస్కృతిక కార్యక్రమాలలో పాలు పంచుకున్నాడని, వివిధ శిక్షణ తరగతులలో పాల్గొన్నాడనిఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.బి.సదాశివయ్య తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు అనేక సామాజిక కార్యక్రమాలలో పాల్గొనడం వల్ల దేశం మీద భక్తిభావం పెరుగుతుందని ఇలాంటి విద్యార్థులు ఎందరికో ఆదర్శమని ప్రిన్సిపల్ కొనియాడారు. అభిలాష్ ను ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సదాశివయ్య, అధ్యాపకుడు రాఘవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అభిలాష్‌ను అభినందిస్తున్న దృశ్యం